ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 42 | సోమవారం 10 నవంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

**సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +**




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...

బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715



### భగవాన్ శ్రీసత్యసాయి శతజయంతి మహోత్సవానికి ముస్తాబైన

# పుట్టపర్తి

- అందంగా ముస్తాబవుతున్న శ్రీ సత్యసాయి నిలయమైన పుట్టపర్తి..
- ప్రభుత్వ ఆధ్వర్యంలో శత జయంతి వేడుకల ఏర్పాట్లు ముమ్మరం..
- ఎమ్మెల్యే సింధూర, జిల్లా కలెక్టర్‌లు అనునిత్యం పర్యవేక్షణ...
- సుమారు రూ 10కోట్లకు పైగా వెచ్చించి మౌలిక సౌకర్యాలు...
- 13వ తేదీ నుండి భగవాన్ శ్రీ సత్యసాయి జన్మదిన వేడుకలు ...
- హాజరు కానున్న ప్రధాని, పలు రాష్ట్రాల గవర్నర్‌లు, సిఎంలు....



**మా..బాబ్‌జాన్, నల్లమాడ...**

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి మహోత్సవాలకు పుట్టపర్తి పట్టణం సుందరంగా ముస్తాబవుతోంది. ప్రతి ఏడాది శ్రీ సత్యసాయిబాబా వారి జయంతి వేడకలు అట్టహాసంగానే కొనసాగుతున్నప్పటికీ ఆయన శత జయంతి కావడంతో రాష్ట్ర ప్రభుత్వమే జయంతి మహోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన విషయం విదితమే.. ఈ విషయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర చొరవ అభినందనీయం. శత జయంతి వేడుకల సందర్భంగా లక్షల మంది భక్తాదులు హాజరయ్యే అవకాశం వుండటంతో భక్తాదుల మౌలిక వసతుల కోసం ఏర్పాట్లను ముమ్మరంగా చేబట్టారు. ఇప్పటికే పట్టణంలో పలు అభివృద్ధి పనులు కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర పర్యవేక్షణలో పూర్తయ్యాయి...

2లో

# కుంకీల పర్యవేక్షణ గుడ్

- కుంకీ ఏనుగుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించిన డిప్యూటి సిఎం
- ఆకట్టుకున్న మదపుటేనుగులను కట్టడి చేసే విన్యాసం
- కుంకీలకు స్వయంగా ఆహారం అందించిన పవన్ కళ్యాణ్
- కుంకీల బాధ్యత చూసే మావటీలకి రూ.50 వేలు బహుమానం
- మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్ కు శ్రీకారం
- అధునాతన సోలార్ ఫెన్సింగ్ వ్యవస్థకు పునాది రాయి



**చిత్తూరు, నవంబర్ 9 :**

మదపుటేనుగుల దాడుల నుంచి పంట పొలాలను, మనుషులను రక్షించేందుకు ప్రత్యే కంగా కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చిన కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం సందర్శించారు. ఆదివారం, చిత్తూరు జిల్లా, పలమనేరు నియోజకవర్గం, ముసల మడుగు వద్ద ఉన్న శిక్షణ కేంద్రానికి విచ్చేసిన ఆయన ఏనుగుల శిక్షణ, సంరక్షణ తదితర అంశాలను స్వయంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక నుంచి తెచ్చిన నాలుగు కుంకీ ఏనుగులతోపాటు గతంలో ఇదే శిక్షణ కేంద్రంలో ఉన్న మూడు కుంకీలు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాయి. శిక్షణలో కుంకీ ఏనుగులు చూపుతున్న మెలకువలు, ఇటీవల జరిగిన ఆపరేషన్ల తీరును అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు ప్రత్యేకంగా చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. క్రమబద్ధంగా కుంకీ ఏనుగులు వరుసగా వస్తూ ఘీంకారం చేస్తూ పవన్ కళ్యాణ్‌కి సెల్యూట్ చేశాయి. అనంతరం అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువచ్చేది ఏనుగుల చేత ప్రదర్శింపజేశారు. మానవ, ఏనుగుల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు మదపుటేనుగుల గుంపు, నివాసాలు, పంట పొలాల వైపు వస్తున్నప్పుడు వాటిని ఎలా నియంత్రించాలో ప్రత్యక్షంగా (మిగతా 2లో)

# వైద్య వ్యవస్థ నిర్వీర్యం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు సూపర్ సక్సెస్ కావాలి..
- కూటమి ప్రభుత్వానికి గుణపాఠం కావాలి...
- ప్రతి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు విరివిగా పాల్గొనాలి..
- వైసీపీ కో ఆర్డినేటర్ సజ్జల పిలుపు...



**తాడేపల్లి, నవంబర్ 9 :**

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 12న జరిగే ర్యాలీలను సూపర్ సక్సెస్ చేద్దాం. వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం. ప్రజా స్పందనను బలంగా వినిపిద్దాం' అంటూ పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, అనుబంధ విభాగాల (మిగతా 2లో)

# మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్స్ అరెస్టు

త్వరలో ఇండియాకు తీసుకురానున్న ఇండియన్ సెక్యూరిటీ ఏజెన్సీ అధికారులు



2లో

# ఆస్తులు, అంతస్తులే కాదు.. ఆరోగ్యం ముఖ్యం

**శంకర్ కంటి ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని ప్రారంభించిన సిఎం**

**గుంటూరు, నవంబర్ 9 :**

ఆస్తులు, అంతస్తులు, కార్లు ఉన్నప్పటికీ ఆరోగ్యమే కీలకమని స్పష్టం చేశారు. అనారోగ్యమే అసలైన పేదరికమని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందంటే అందుకు కంచి పీఠం లాంటి ఆధ్యాత్మిక సంస్థలే కారణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆదివారం గుంటూరు సమీపంలోని శంకర ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. శంకర ఆస్పత్రిలో ఈ విభాగాన్ని ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శంకర ఆస్పత్రి 50 ఏళ్ల వేడుకకు సైతం తాను ముఖ్య అతిథిగా హాజరవుతానని చెప్పారు. రోజుకు 750 మందికి ఉచితంగా నేత్ర పరమైన వైద్య సేవలందించడం అరుదైన విషయమని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో సైతం శంకర ఆస్పత్రి సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఉచితమనే కాకుండా శంకర ఆసుపత్రిలో సమర్థవంతంగా సేవలందిస్తున్నారని వివరించారు. రెయిన్‌బో కార్యక్రమం ద్వారా చిన్నారుల కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారంటూ శంకర ఆసుపత్రి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఆర్థికపరమైన లక్ష్యాలతో కాకుండా ఆధ్యాత్మిక సేవ లక్ష్యంతో ఈ ఆసుపత్రి నిర్వహిస్తున్నారని తెలిపారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించటమే తన లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో చిన్న పెద్దా అని తేడా లేకుండా అందరికీ వర్తించేలా 2, 50, 000 మందికి హెల్త్ ఇన్సూరెన్స్‌ను తీసుకురానున్నట్లు వివరించారు. సంజీవని పథకం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామని ప్రకటించారు. మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందంటే అందుకు కంచి పీఠం లాంటి ఆధ్యాత్మిక సంస్థలే కారణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.



# నేడు ఏపీ కేబినెట్ భేటీ

**విశాఖ వేదికగా భాగస్వామ్య సదస్సు, జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై చర్చ**
**మొంథా తుపాను ప్రభావం.. నష్టం అంచనాపై చర్చ జరిగే అవకాశం**

**అమరావతి, నవంబర్ 9 :**

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం నేడు (సోమవారం) జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో ఏపీ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా విశాఖ వేదికగా జరిగే భాగస్వామ్య సదస్సు, జిల్లాల పునర్య వస్థీకరణ వంటి అంశాలపై మంత్రిమండలి సమావేశంలో



చర్చించనున్నారు. నవంబర్14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు (మిగతా 2లో)

# మొంథా నష్టం అంచనాకు కేంద్ర బృందం

- మొంథా తుపాను నష్టం అంచనాకు రంగంలోకి కేంద్ర బృందాలు...
- 7గురు సభ్యులతో కూడిన టీం తుపాను ప్రభావిత ప్రాంతాల్లోపర్యటన...
- నేరుగా తుపాను బాధితులతో మాట్లాడున్న కేంద్ర బృందం...
- నష్టం అంచనా అనంతరం కేంద్రానికి నివేదికలు...



**అమరావతి, నవంబర్ 9 :**

మొంథా తుపాను కారణంగా ఏపీలో జరిగిన నష్టం వేళ అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. మొంథా తుఫాను తో ఏపీ నష్టపోయిన తీరు పై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించింది. దాదాపు రూ 5,265 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చింది. కాగా, కేంద్రం వెంటనే స్పందించింది. కేంద్ర బృందాలను రంగంలోకి దించింది. రెండు రోజుల క్షేత్ర స్థాయి పర్యటన తరువాత ఇచ్చే నివేదిక ఆధారంగా సాయం పైన నిర్ణయం తీసుకోనుంది. దీంతో, ఈ కేంద్ర బృందాల పర్యటన కీలకంగా మారుతోంది. రాష్ట్రంలో మొంథా తుపాను నష్టాల అంచనాకు నవంబరు 10, 11 తేదీల్లో కేంద్ర బృందం ప్రభావిత జిల్లాల్లో పర్యటించనుంది. తుఫాను కారణంగా ప్రకాశం, బాపట్ల, కృష్ణా, ఏలూరు, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో నష్టాల్ని బృందం పరిశీలించనుంది. ఏపీ ప్రభుత్వం సేకరించిన నష్టం వివరాల మేరకు రూ 5,265 కోట్ల మేర నష్టం జరిగినట్లు గుర్తించారు. కేంద్రం సాయం కోరుతూ నివేదిక సమర్పించారు. దీంతో.. ఏపీకి వస్తున్న కేంద్ర బృందాలు ఆరు జిల్లాల్లో పర్యటించేలా షెడ్యూల్ ఖరారైంది. రెండు టీంలు ఈ పర్యటన చేయనున్నాయి. తుఫాను కారణంగా అత్యధి కంగా కృష్ణా జిల్లాలో 31,033, కోనసీమలో 29,537, కాకినాడలో 21,422, తూర్పుగోదావరిలో 15,666, బాపట్లలో 13,258, ప్రకాశంలో 12,280, నంద్యాలలో 11,447, పశ్చిమగోదావరిలో 8,958, ఏలూరులో 5,671, ఎన్టీఆర్ జిల్లాలో 5,039 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు గుర్తించింది. కేంద్ర హెూంశాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమీ బసు నేతృత్వంలోని ఎనిమిది మంది సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో కేంద్ర బృందానికి సంక్షిప్త సమా చారం ఇచ్చేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులంతా హాజరు కావాలని నిర్దేశించారు. కేంద్ర (మిగతా 2లో)

# ఏఐ షేర్లు భారీగా పతనం

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా వున్న అమెరికాలో తీవ్ర ఆందోళన
- దారుణంగా పడిపోయిన ఏఐ ఆధారిత షేర్లు
- రికార్డు స్థాయిలో ఉద్యోగాల తొలగింపుతో అమెరిగా ఆర్థిక అనిశ్చితి
- ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం

**న్యూ ఢిల్లీ, నవంబర్ 9 :**



ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా ఉన్న అమెరికాలో ప్రస్తుత పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. టెక్నాలజీ రంగంలో గత రెండేళ్లుగా విపరీతంగా పెరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత షేర్ల విలువలు ఇప్పుడు దారుణంగా పతనమవుతున్నాయి. మార్కెట్ వర్గాలు దీన్ని ఏఐ బుడగ పగలడంగా భావిస్తున్నాయి. ఈ పరిణామాలు రికార్డు స్థాయి ఉద్యోగాల తొలగింపుతో కలిసి అమెరికా ఆర్థిక అనిశ్చితిని పెంచి ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ స్టాక్ మార్కెట్‌లో ముఖ్యంగా నాస్‌డాక్ ఇండెక్స్‌లో నవంబర్ 6న జరిగిన భారీ పతనం ఏఐ కంపెనీల భవిష్యత్తుపై నెలకొన్న అనుమానాలను బలపరుస్తోంది. గత 24 నెలల్లో చాలా ఏఐ సంబంధిత టెక్ కంపెనీల షేర్ల ధరలు వాటి వాస్తవ వృద్ధి కంటే చాలా వేగంగా పెరిగాయి. దీనినే అతి-విలువగా పేర్కొంటున్నారు. కొన్ని ప్రముఖ ఏఐ కంపెనీలు అంచనాలకు తగ్గట్టుగా మంచి త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ (మిగతా 2లో)

# భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతికి పుట్టపర్తి ముస్తాబు






(మొదటి పేజి (తరువాయి)

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి మహోత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పుట్టపర్తి పట్టణం ముస్తాబవుతోంది. పుట్టపర్తిలో అన్ని ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ 10కోట్లు మంజూరు చేసింది. నగర పంచాయతీ నుంచి రూ 2కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేబట్టారు. ప్రశాంతి రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తి వరకు విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. స్వాగత ఆర్చులు ఆకట్టుకుంటున్నాయి. వెస్ట్ గేట్ పరిసరాల్లో భక్తాదులు బస చేసేందుకు పెద్దపెద్ద షెడ్లను ఏర్పాటు చేశారు. వాటిలో బసచేసే భక్తాదులకు నీటి సౌకర్యం, భోజన సౌకర్యంతో పాటు మొబైల్ టాయిలెట్లను కూడా ఏర్పాటు చేశారు. పుట్టపర్తి పట్టణ పరిధిలోని ప్రతి రహదారిని మరమ్మత్తులు చేశారు. పట్టణంలో నీటి వసతి, డ్రైనేజ్ వ్యవస్థను మరమ్మత్తులు పూర్తీ చేశారు. అవసరమైన చోటల్లా పెద్ద విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేసి వీధిలైట్లను అమర్చారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారు ప్రశాంతి నిలయంలో అవసరమైన ఏర్పాట్లలో తలమునకలయ్యారు. గత కొన్ని మాసాల క్రితమే చిత్రావతి నదీ తీరంలో పార్కు, పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం జోయ్ అలుకాస్ వారు రూ కోటి 20 లక్షల వరకు అందజేశారు. ఇప్పటికే చిత్రావతి ప్రాంతం అంతా సుందరంగా తయారు చేయడంతో పాటు పార్కు పనులు పూర్తీ కావస్తున్నాయి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి శత జయంతి కావడంతో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర చొరవతోనే ప్రభుత్వం ముందుకొచ్చి, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే జయంతి మహోత్సవ వేడుకలు పూర్తీ చేయాల్సి వుండటంతో భక్తాదులకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బాబావారి శత జయంతి కావడంతో దేశ, విదేశాలు, పలు రాష్ట్రాల నుండి లక్షల మంది హాజరయ్యే అవకాశం వుందన్న అంచనాలున్నాయి. ఈనేపథ్యంలో హాజరయ్యే భక్తాదులకు అన్ని రకాల వసతులతో ఇప్పటికే భారీ షెడ్లను ఏర్పాటు చేశారు. ఈనెల 13వ తేదీ నుండి 25వ తేదీ వరకు బాబా శతజయంతి వేడుకల నిర్వహణ కొనసాగే అవకాశం వుంది. ఈ నేపథ్యంలో సుమారు 10 రోజుల పాటు మందిరంలోని క్యాంటీల్లో కూడా మూడు పూటలా ఉచిత భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ వేడుకలకు దేశ విదేశాల ప్రముఖులకు ట్రస్ట్ ద్వారా ఆహ్వానాలందజేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్, పలు రాష్ట్రాల గవర్నర్‌లు, ఉపరాష్ట్రపతి, పలు దేశాల నుండి ప్రముఖులు హాజరు కానున్నారు. దీంతో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనుంది. అదేవిధంగా 13వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే బాబా వారి శత జయంతి మహోత్సవ వేడుకల్లో ట్రాఫిక్ నియంత్రణ, హాజరయ్యే వారి వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఓ వైపు భక్తాదులకు, పట్టణవాసులకు ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో అధికారగణం తలమునకలయ్యింది. ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వం సమిష్టిగా నిర్వహిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి మహోత్సవ వేడుకలు అంబరాన్నంటనున్నాయి...

ఎమ్మెల్యే పల్లె సింధూర చొరవ అభినందనీయం...
భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలు ప్రభుత్వమే నిర్వహించాలని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ఒప్పించడంలో ఎమ్మెల్యే సింధూర కార్యోన్ముఖులయ్యారు. ఈనేపథ్యంలో పుట్టపర్తిలో పలు అభివృద్ధి పనులు, పర్యాటకంగా ముస్తాబు చేయడంలో ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిల పర్యవేక్షణ, పనితీరు హర్షణీయం..

# కుంకీల పర్యవేక్షణ గుడ్

(మొదటి పేజి (తరువాయి)

కుంకీ ఏనుగులకు మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్ ను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు చేసిన ప్రదర్శనలు ఉప ముఖ్యమంత్రివర్యులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏనుగులకు ఆయన స్వయంగా బెల్లం ఆహారం అందించారు.అనంతరం గజరాజుల ఆశీర్వచనం తీసుకున్నారు.

**ముసలమడుగు ఏనుగుల క్యాంపు ప్రారంభోత్సవం..**

అనంతరం పవన్ కళ్యాణ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో ముసలమడుగులో ఏర్పాటు చేసిన నూతన ఏనుగుల క్యాంపును ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలా ఫలకాన్ని ప్రారంభించారు. ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి పునాదిరాయి వేశారు. సౌర శక్తితో పని చేసే వేలాడే అటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి పవన్ కళ్యాణ్ పునాది రాయి వేశారు.

**మియావకీ తరహా ప్లాంటేషన్ కి శ్రీకారం..**

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా అడవిని పెంపొందించే మియావకీ తరహా ప్లాంటేషన్ కు, ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్ర వద్ద పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్లాంటేషన్ ను ఏర్పాటు చేశారు. ఉసిరి మొక్కను నాటి పవన్ కళ్యాణ్ ఈ దట్టమైన అడవుల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీటరకు ఒక్కటి చొప్పున నాటిన మియావకీ ప్లాంటేషన్ ను స్వయంగా మొబైల్ లో వీడియో తీసుకున్నారు. మధ్యన పొదలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**మావటీలకి ఉప ముఖ్యమంత్రివర్యులు రూ.50 వేలు బహుమానం**

కర్ణాటక ప్రభుత్వం నుంచి కుంకీ ఏనుగులను స్వీకరించేటప్పుడు వీటిని జాగ్రత్తగా చూసుకుంటామని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆ విధంగానే పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో మావటీలు.. కుంకీల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్నారు. వారి పని తీరు మెచ్చుకుంటూ, పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులు రూ.50 వేలు బహుమానంగా అందించారు.
ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీ శాఖ సలహాదారు మల్లికా ర్జునరావు, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ దూడీ, అనంతపురం, తిరుపతి ఫారెస్ట్ కన్జర్వేటర్లు యశోద బాయి, చిత్తూరు డీఎఫ్ఓ సుబ్బరాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏఐ షేర్లు భారీగా పతనం

(మొదటి పేజి (తరువాయి)

షేర్లు పడిపోతున్నాయి. ఎందుకంటే అధిక ధరల వద్ద కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లకు భవిష్యత్తులో ఈ కంపెనీలు ఆ విలువలకు తగిన రిటర్న్స్ ఇవ్వగలవనే నమ్మకం సన్నగిల్లింది. అంచనాలు, వాస్తవాల మధ్య పెరుగుతున్న అంతరం కారణంగానే పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతున్నారు.

మాంద్యం భయాలు..

రికార్డు స్థాయి తొలగింపులు టెక్నాలజీ రంగం నుంచి రిటైల్, లాజిస్టిక్స్ వరకు అన్ని రంగాలలో భారీగా ఉద్యోగాలు తొలగించబడుతున్నాయి. ఈ తొలగింపులు అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మాంద్యం అంచున ఉందని సూచిస్తున్నాయి. అక్టోబర్ 2025లో సుమారు 1.53 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోవడం అనేది గత 20 ఏళ్లలో అక్టోబర్ నెలలో జరిగిన అత్యధిక ఉద్యోగాల కోత. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు 11 లక్షల ఉద్యోగాలు పోయాయి. ఒకవైపు ఆర్థిక అనిశ్చితి, పెరుగుతున్న వ్యయాల కారణంగా కంపెనీలు ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు ఏఐ, ఆటోమేషన్ టెక్నాలజీ ప్రవేశంతో మానవ వనరుల అవసరం తగ్గిపోతోంది. ఈ ప్రభావాల కారణంగా వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు.
ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి మార్కెట్ల పతనానికి కేవలం ఏఐ షేర్ల భయాలు మాత్రమే కాక స్థూల ఆర్థిక అంశాలు కూడా కారణమవుతున్నాయి. అమెరికాపై ఉన్న అప్పు 38 ట్రిలియన్ డాలర్లకు పైగా చేరుకుంది. ఇది జీడీపీలో 324 శాతానికి సమానం. ఈ అప్పును నియంత్రించడంలో విఫలమైతే, భవిష్యత్తులో దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉండటం, కంపెనీల రుణభారాన్ని పెంచి, వృద్ధిని అడ్డుకుంటుంది. ఆర్థిక సవాళ్లకు తోడు, అమెరికన్ రాజకీయాల్లో పెరుగుతున్న అనిశ్చిత వాతావరణం కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది.
అమెరికన్ మార్కెట్‌లో ఈ పతనం కేవలం టెక్నాలజీ రంగానికి మాత్రమే పరిమితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు, ఆర్థిక వ్యవస్థపై నీలినీడలు కమ్మేలా ఉంది. ఇన్వెస్టర్లు ఇప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండటం తప్పనిసరి.

# వైద్య వ్యవస్థ నిర్వీర్యం

(మొదటి పేజి (తరువాయి)

అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్స్, మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, జెడ్పీటీసీలు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మునిసిపల్ ఛైర్పర్సన్లు, వైస్ ఛైర్పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలతో సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 12న ర్యాలీలు జరుగనున్నాయి, కోటి సంతకాల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో మీరంతా ఉన్నారు, ఇదంతా కూడా ఒక ప్రజా ఉద్యమంగా కొనసాగుతోంది. మీ అందరి భాగస్వామ్యం వల్ల కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం విజయవంతం అవుతుంది. మనం తీసుకుంటున్న ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా 12న జరిగే ర్యాలీలు ఉండాలి. వైద్యవ్యవస్థను జగన్ ప్రజలకు చక్కటి గొడుగులా తయారుచేస్తే చంద్రబాబు దానిని నిర్వీర్యం చేశారు. మనం చేసే ఆందోళనలు, ర్యాలీలు జాతీయస్థాయిలో చర్చ జరిగేలా ఉండాలి. అప్పుడే చంద్రబాబు ప్రభుత్వం దిగివస్తుంది. కలిసి వచ్చే పార్టీలందరినీ కలుపుకుపోదాం. కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్లు ఇలా అందరినీ కలుపుకుందాం. అప్పుడే సూపర్ సక్సెస్ అవుతుంది. ఇందుకు అవసరమైన కసరత్తు పూర్తిచేయాలి. ఏ మాత్రం ఏమరుపాటు వద్దు, అందరూ ఈ కార్యక్రమాన్ని పర్సనల్గా తీసుకుని సక్సెస్ చేయాలి. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుందాం. మీ పరిధిలో ఉన్న వారందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి ర్యాలీలు సక్సెస్ చేయాలి. మీరంతా ఓనర్ షిప్ తీసుకుని లీడర్లుగా నిరూపించుకునే అవకాశం ఇది. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా మీరంతా సిద్ధంగా ఉండాలి, దీనిపై కూడా సీరియస్గా దృష్టిపెట్టాలి. క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఈ కమిటీలన్నీ పూర్తయితే దాదాపు 13 లక్షల మంది సైన్యం సిద్ధమవుతుంది. ఇదంతా పారదర్శకంగా డిజిటలైజేషన్ చేయాలి. పరిశీలకుల సహకారం తీసుకుని పక్కాగా చేయండి. కేంద్ర కార్యాలయం నుంచి అవసరమైన సహకారం ఉంటుంది. అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ మేనేజర్లను కూడా నియమించడం జరిగింది. కమిటీల ఏర్పాటు పకడ్బందీగా చేయాలి, డేటా అంతా కూడా డిజిటలైజ్ చేయాలి. ప్రతి ఇంట్లో మన పార్టీ ఉంటుంది, నిత్యం ప్రజా సమస్యలపై మనం చేస్తున్న పోరాటాలకు అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. ప్రజల్లో మన పార్టీకి ఉన్న ఇమేజ్ బాగా పెరుగుతుంది. దీనిని ఇంకా మరింతగా పెంచుకుందాం. కూటమి ప్రభుత్వ అరాచకాలను ధీటుగా ఎదుర్కొందాం'అని సూచించారు..

# పేదల ఇళ్లకు మరింత సాయం

**దరఖాస్తులకు మరింత గడువు పెంచిన ప్రభుత్వం**

**పీఏం ఏవై కింద అర్హులకు ఇళ్ల మంజూరు**

**పీఎం జీవై వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు..**



**అమరావతి, నవంబర్ 9 :**

ఏపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పైన కీలక నిర్ణయం తీసుకుంది. అర్హత కలిగిన వారికి ఇళ్ల మంజూరు కు వీలుగా అధికారులకు కీలక సూచనలు చేసింది. అదనపు సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద ఆసక్తి, అర్హత కలిగిన వారికి ఇళ్లను మంజూరు చేస్తోంది. అర్హతలు.. విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. దీంతో, పేదలకు ఇళ్లు దక్కించుకునేందుకు మార్గం సుగమం అవుతోంది. పేదలకు సొంతింటి కల ఫలించేలా ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. అర్హత కలిగిన వారికి ఇళ్లు మంజూరు చేయడానికి వీలుగా దరఖాస్తు గడువును మరింత పొడిగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. దీనికి తొలుత కేంద్రం ఈనెల 5 వరకు మాత్రమే గడువు ఇచ్చింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ కోరిక మేరకు నెలాఖరు వరకు పొడిగించింది. తద్వారా మరో మూడు వారాలపాటు దరఖాస్తుకు అవకాశం ఉంది. దీనివల్ల మరింత మందికి ప్రయోజనం కలుగుతుందని అధికారులు వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో రాష్ట్ర – కేంద్ర ప్రభుత్వం కలిపి రూ 2.89 లక్షల వరకు ఇస్తున్నాయి. ఈ మొత్తంలో ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ నిధులు కలిపి ఉన్నాయి. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి కేవలం రూ. 1.59 లక్షలు మాత్రమే వస్తుంది. కాగా, పీఎంఏవై ద్వారా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోడానికి సిద్ధంగా ఉన్నవారి వివరాలను యాప్‌లో నమోదు చేయిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం గడువు పెంచడంతో అర్హులైన వారందరికీ మేలు జరుగనుంది. అర్హత కలిగి ఉన్న ఎవ రన్నా పీఎంఏవైను సద్వినియోగం చేసుకోవచ్చని ..అందుకు ఎలాంటి పరిమితులు లేవని అధికా రులు స్పష్టం చేస్తున్నారు. దరఖాస్తులను గృహ నిర్మాణ సంస్థ, సచివాలయాల్లో అందించేందుకు అవకాశం కల్పించారు. ఇళ్లు లేని పేదలు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను కలిసి అధికారిక వెబ్‌సైట్ పిఎం జీవై ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అదే సమయంలో సొంత స్థలంలో ఇంటి పట్టా తీసుకుని ఉండాలి. లేదంటే ఈనెలాఖరులోపు అందించేలా ఉండాలి. నివాస స్థలంలో లబ్ధిదారు ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ఇళ్లు లేనట్లు, ఉన్నట్లయితే పాడైపోయిన ఇంటి ఫొటో జత చేయాల్సి ఉంటుందని అధికారులు సూచించారు. కాగా, బ్యాంక్ ఖాతా నంబర్, పేరు నమోదు. నరేగా జాబ్ కార్డు నంబరు వివరాలు అందించాలి. ఆధార్ నంబర్‌ను ఉపయోగించే అధికారం ఇవ్వడానికి సమ్మతి పత్రం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పీఎంఏవై ఐడీ, ప్రాధాన్యత ఎంపికను ఉపయోగించాలి. ఈ ప్రకియను ఇంజినీరింగ్ అసిస్టెంట్ ద్వారా పూర్తి చేసుకునే సౌలభ్యం కల్పించారు. దీని ద్వారా ఎక్కువ మందికి లబ్ది చేకూరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# కుప్పకూలిన హెలీక్యాప్టర్.. 5గురు మృతి

**న్యూ ఢిల్లీ, నవంబర్ 9 :**

రష్యాలో ఆర్మీ హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. మృతుల్లో యుద్ధ విమానాల పరికరాల తయారీ సిబ్బంది ఉన్నట్లు సమాచారం. హెలికాప్టర్ ఆకస్మాత్తుగా ఒకేసారి నేలను ఢీకొట్టడంతో తోక భాగం ముక్కలైంది. దీంతో ప్రమాదం సంభవించింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హెలికాప్టర్ నేలకు ఢీ కొట్టడంతో తోక భాగం తెగిపోయి వేలాడింది. అయినా పైలట్ హెలికాప్టర్ ను నడిపే ప్రయత్నం చేశాడు. అలా కొంచెం ముందుకెళ్లి ఓ ఇంటిపై పడింది. దీంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ మంటల్లో హెలికాప్టర్ లోని ఏడుగురు ప్రయాణికుల్లో ఐదుగురు సజీవ దహనం అయ్యారు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రష్యాలోని కాస్పియన్ సముద్ర తీరంలో ఉన్న రష్యన్ డాగేస్తాను ప్రాంతంలో షాకింగ్ ఘటన జరిగింది. ఓ ఆర్మీ హెలికాప్టర్ ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ఈ ఘటనలో ఐదుగురు సిబ్బంది మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. యుద్ధ విమానాల విడి భాగాలు తయారు చేసే సిబ్బందితో ఆర్మీ హెలికాప్టర్ ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా నేలకు ఢీ కొట్టడంతో తోక భాగం తెగిపోయింది. దీంతో హెలికాప్టర్ అలా కొద్దిసేపు గాల్లోనే ప్రయాణించి దగ్గరలో ఉన్న ఓ ఇంటిపై పడింది. దీంతో మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో విమానంలోని ఐదుగురు సజీవదహనం అయ్యారు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. హెలికాప్టర్



గాలిలో చక్కర్లు కొడుతున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. సాంకేతిక లోపం కారణంగానే విమానం కుప్పకూలినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు నిర్వహిస్తున్నారు. జెన్ హువా న్యూస్ కథనం ప్రకారం.. దక్షిణ రష్యాలోని డాగేస్తాన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు రష్యా మంత్రి యారోస్లావ్ గ్లాజోవ్ స్పష్టం చేశారు. ఈ హెలికాప్టర్ లో రష్యాలో ఎయిర్ క్రాఫ్ట్ పరికరాలను తయారు చేసే కిజ్లార్ ఎలక్ట్రోమెకానికల్ ప్లాంట్ కు చెందిన ఏడుగురు సిబ్బంది ఉన్నారని తెలిపారు.

# నేడు ఏపీ కేబినెట్ భేటి

(మొదటి పేజి (తరువాయి)

ే ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను ఇప్పటికే మంత్రులకు అప్పగించారు చంద్రబాబు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే మంత్రిమండలి సమావేశంలో భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై మంత్రులను వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. అలాగే ఇటీవల జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సోమవారం జరిగే కేబినెట్ భేటీలో వీటికి ఆమోద తెలిపే అవకాశం ఉంది. వీటితో పాటుగా మొంథా తుఫాన్ కారణంగా ఏపీపై పడిన ప్రభావం, తుఫాను నష్టం అంచనాలు, పరిహారం వంటి అంశాల గురించి కూడా చర్చించే అవకాశాలు ఉన్నాయి. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఎన్ ఏ బి ఎఫ్ ఐడి నుంచి రూ.7,500 కోట్ల రుణం తీసుకోవడానికి సీఆర్డీఏకు కేబినెట్ అనుమతి ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాగే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పలు సంస్థలకు భూముల కేటాయింపుపైనా నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

# గ్యాంగ్ స్టర్స్ అరెస్టు

**న్యూఢిల్లీ, నవంబర్ 9 :**

విదేశాల్లో ఉంటూ ఇండియాలో నేర కార్యకలాపాలు సాగిస్తున్న ఇద్దరు మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్స్‌ను ఇండియన్ సెక్యూరిటీ ఏజెన్సీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌లో సెక్యూరిటీ ఏజెన్సీ అధికారులతో పాటు హర్యానా పోలీస్ శాఖకు చెందిన పోలీసులు కూడా పాల్గొన్నారు. మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్‌లో ఒకడైన వెంకటేష్ గార్గ్‌ను జార్జియాలో అరెస్ట్ చేశారు. మరో గ్యాంగ్‌స్టర్ భాను రానాను యునైటెడ్ స్టేట్స్‌లో అదుపులోకి తీసుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో భాను రానాకు సంబంధాలు ఉండటం గమనార్హం. ఈ ఇద్దరినీ అతి త్వరలో విదేశాలనుంచి ఇండియాకు తీసుకురానున్నారు. కాగా, ఇండియాకు చెందిన 12 మందికి పైగా గ్యాంగ్‌స్టర్స్ విదేశాల్లో ఉంటున్నారు. అక్కడినుంచి ఇండియాలో తమ నేర కార్యకలాపాలను సాగిస్తున్నారు. కిమినల్స్‌ను పనిలో పెట్టుకుని సిండికేట్ నడుపుతున్నారు. వెంకటేష్ గార్గ్, భాను రానాల అరెస్ట్‌తో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో విస్తుపోయే విషయాలు బయటపెడుతున్నారు.

**గ్యాంగ్‌స్టర్స్ నేర చరిత్ర ఇదీ..**

వెంకటేష్ హర్యానాలో జన్మించాడు. అతడిపై ఇండియాలో 10కి పైగా కేసులు ఉన్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ నేత హత్య తర్వాత జార్జియా పారిపోయాడు. అక్కడినుంచి ఇండియాలో తన నేర కార్యకలాపాలు సాగిస్తున్నాడు. హర్యానా, రాజస్తాన్, ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలోని మిగిలిన రాష్ట్రాలనుంచి క్రిమినల్స్‌ను పనిలో పెట్టుకున్నాడు. వారి సాయంతో ఇండియాలో నేరాలకు పాల్పడుతున్నాడు. ఇక, భాను రానా విషయానికి వస్తే.. రానాకు బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయి. కర్నల్ ప్రాంతానికి చెందిన రానాపై కూడా పెద్ద సంఖ్యలో కేసులు ఉన్నాయి. హర్యానా, పంజాబ్, ఢిల్లీ ప్రాంతాల్లో ఇతడు నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. పంజాబ్‌లో గ్రెనేడ్ దాడి జరిగిన సమయంలో రానా పేరు దేశ వ్యాప్తంగా తెగ చక్కర్లు కొట్టింది.

# కేంద్ర బృందం రాక

(మొదటి పేజి (తరువాయి)

హెూంశాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమి బసు నేతృత్వంలో ఎడుగురు సభ్యులతో కూడిన బృందం పర్యటన చేయనుందని విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. సోమవారం టీం-1 బాపట్ల జిల్లాలో, టీం-2 కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. మంగళవారం టీం-1 ప్రకాశం జిల్లాలో , టీం-2 కోనసీమ జిల్లాల్లో పర్యటించి నష్టాల్ని స్వయంగా పరిశీలించడంతో పాటు తుపాను బాధితులతో నేరుగా మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు.

# రాత్రికి రాత్రే రూ 240 కోట్లు

**హైదరాబాద్, నవంబర్ 9 :**

శ్రమకు ప్రతిభ తోడైతే విజయం దక్కుతుంది. కానీ ఆ అదృష్టం కూడా తోడైతే, ఏకంగా రూ.240 కోట్ల భారీ సంపద వచ్చి తలుపు తడుతుంది. ఇది నమ్మశక్యం కాని కథ, తెలంగాణ యువకుడు, యూఏఈలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ నిజ జీవితంలో అద్భుతం జరిగింది. ఖమ్మం జిల్లా, వేంసూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, రైతు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చారు. తన ప్రతిభతో విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించి స్థిరపడ్డారు. తరచూ లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉన్నా, ఈసారి మాత్రం తన తల్లి పుట్టిన తేదీ సంఖ్యను ఎంచుకున్నారు. కుటుంబం పట్ల అనిల్‌కు ఉన్న ఈ సెంటిమెంట్, అతని జీవితంలో అత్యంత విలువైన పెట్టుబడిగా మారింది. ఆ ఒక్క టికెట్, అతనికి ఏకంగా 240 కోట్ల రూపాయల బహుమతిని తెచ్చిపెట్టింది. రాత్రికి రాత్రే అతని జీవితం పూర్తిగా మారిపోయింది. కష్టం విలువ తెలిసిన కుటుంబానికి, ఈ భారీ మొత్తం తరతరాలు గడిచేంత ఆర్థిక భద్రతను అందిస్తుంది అనడంలో సందేహం లేదు. అనిల్ కుమార్ విజయం నిజంగా సంతోషించదగిన విషయం అయినప్పటికీ, ఇలాంటి కథనాలు చూసి చాలామంది సాధారణ ప్రజలు తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంది. అందుకే, ఆర్థిక నిపుణులు లాటరీల విషయంలో ప్రజలను హెచ్చరిస్తున్నారు. లాటరీ గెలిచిన కొద్దిమంది గురించే వార్తలు వస్తాయి. కానీ, లాటరీలలో డబ్బు కోల్పోయి, అప్పుల పాలైన లక్షలాది మంది నష్టపోయిన కథలు వెలుగులోకి రావు. లాటరీ కొనుగోలు అనేది ఒక రకమైన జూదం లాంటిది. ఇది ఒక వ్యసనంగా మారితే, మొత్తం సంపాదనను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉంటుంది. అదృష్టం అనేది కేవలం అరుదుగా మాత్రమే తలుపు తడుతుంది. అందువల్ల, అనిల్ కుమార్ కథను ఒక అద్భుతంగా మాత్రమే చూడాలి కానీ, దాన్ని అనుకరించి లాటరీ ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# డబ్బులు ఊరికే రావు

**హైదరాబాద్, నవంబర్ 9 :**

నేటి కాలంలో సైబర్ నేరాలకు ఎవరూ అతీతులు కారు. ముఖ్యంగా చదువుకున్న, టెక్నాలజీ గురించి తెలిసిన వారే బాధితులుగా మారుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఇక చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని కొందరు సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. రోజూ రూ. కోట్ల విలువైన సైబర్ నేరాలు జరుగుతున్నాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. డబ్బులు ఊరికే రావని.. పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలు రకాల యాప్స్, ఏపీకే ఫైల్స్ వల్ల కూడా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. సైబర్?క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బులను ఖాతాల నుంచి లాగేసుకుంటారని అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇలాంటి మోసాలను ఆపి నేరగాళ్ల అకౌంట్లను ఫ్రీజ్?చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను రూపొందించిందని తెలిపారు. ఖాతాల నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే వెంటనే హెల్ప్?లైన్??నెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇటీవలికాలంలో చిన్నారులే లక్ష్యంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇక స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు అంటూ అందినకాడికి దోచేస్తున్నారు సైబరాసురులు. ఈ ఏడాది తొలి 8 నెలల్లోనే ఏకంగా రూ.372 కోట్లు సైబర్ నేరగాళ్లు కొట్టేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది సొమ్ము కూడా కలిపితే అది రూ.976 కోట్లకు చేరినట్లు తెలుస్తోంది.

# సేవా దృక్పథం లయన్స్ క్లబ్ లక్ష్యం

## డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు ..

**పామిడి, నవంబర్ 9:**
సేవా దృక్పథం లయన్స్ క్లబ్ లక్ష్యం అని ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారు పట్టణంలో శ్రీ భావసార క్షత్రియ కళ్యాణ మండపం నందు ఆదివారం ఉచిత కంటి మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కంటిచూపు లేకుంటే జీవితం అంధకారమే అని అందువల్ల కళ్ళ పట్ల నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బెంగుళూరు శంకర కంటి అసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ షిఫ మాట్లాడుతూ మానవ జీవిత గమ్యానికి కంటిచూపే మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. కంటిచూపు బాగుండటం ద్వారనే ఎవరి పనులు వారే చేసుకోగలరన్నారు. అనంతరం కంటి వైద్యనిపుణులు డాక్టర్ షిఫ కంటిచూపు మందగించిన 240 మందిని పరీక్షించి అందులో 75 మందిని ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కంటి పరీక్షలను చేయించుకోవడానికి వచ్చిన ప్రజలతో శ్రీ భావసార క్షత్రియ కళ్యాణ మండపం కిటకిటలాడగా ఉచిత కంటి మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లైంది. ఈకార్యక్రమంలో మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా సెక్రెటరీ ఆవుల ప్రసాద్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్ డాక్టర్ శాంతిప్రియ, అధ్యక్షులు రఘువీర్, ఉపాధ్యక్షులు జయరామ్, ప్రధాన కార్యదర్శి పట్రా శ్రీనివాసులు, ఆర్ఎంపి గంగశేఖర్, దూదేకుల షేక్షావలి, పట్రా నరేష్ కుమార్, అమర్నాథ్ రెడ్డి, ముండే షేక్షావలి, పట్రా రాజేష్, బెంగుళూరు శంకర కంటి అసుపత్రి ఆర్గనైజర్ నీల శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


కంటిచూపు మందగించిన వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యులు షిఫ

# వంద ట్యూబ్ లైట్స్ బ్రేకింగ్ స్టంట్ చేసిన యశస్వి భారతి

## నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్..

**తాడిపత్రి, నవంబర్ 9:**
తలపై వంద ట్యూబ్ లైట్లు పగలగొట్టిన తొమ్మిదేళ్ల చిన్నారి యశస్వి సాహసం చూపరులను ఆకట్టుకుంటుంది. వంద ట్యూబ్ లైట్లను ఆరు నిమిషాల 9 సెకన్లలో తలపై పగలగొట్టుకుని సాహసోపేతంగా స్టంట్ పూర్తి చేసింది. ఆయాన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రికార్డ్ వంద ట్యూబ్ లైట్స్ బ్రేకింగ్ స్టంట్ కార్యక్రమాన్ని చిన్నారి యశస్వి భారతి విజయవంతంగా పూర్తిచేసి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ సాధించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ సీఐ శివ గంగాధర్ రెడ్డి, జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షులు శివయ్య , పెన్షనర్స్ సంఘ ప్రతినిధి సత్య ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. రూరల్ సీఐ శివ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారి యశస్వి భారతి చూపించిన అద్భుత ప్రదర్శన ఆకట్టుకుందని, చిన్న వయస్సులోనే శారీరక దృఢత్వం, మానసిక ఏకాగ్రత, నిరంతర సాధనతో ట్యూబ్ లైట్స్ బ్రేకింగ్ స్టంట్ చేయడం అంత సులువు విషయం కాదని అభినందించారు. ఈసందర్భంగా తైక్వాండో నిర్వాహకులు సాయి మాట్లాడుతూ చిన్నారులలో ప్రతిభను వెలికితీయడంలో తల్లిదండ్రుల మద్దతు, శిక్షకుల కృషి ప్రముఖ పాత్ర పోషిస్తుందని, చిన్నారులలో ధైర్యం, క్రమశిక్షణ,విశ్వాసం, శారీరక, మానసిక బలం పెంపొందించడమే తైక్వాండో అకాడమీ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని రికార్డు కార్యక్రమాలు, స్టేట్, నేషనల్ శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.
అనంతరం యశస్వి భారతి తల్లితండ్రులు పద్మజ, రంగనాథలు అందించిన ప్రోత్సాహానికి గుర్తింపుగా అతిథుల చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారులు, వారి తల్లిదండ్రులను అతిథులు సత్కరించారు.


తలపై ట్యూబ్ లైట్స్ పగులగొడుతున్న దృశ్యం


చిన్నారి యశస్వి భారతి తల్లితండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

# కైలాసనాథునికి అన్నాభిషేకం

**అనంతపురం కల్చరల్, నవంబర్ 9:**
శ్రీ శ్రీ శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమం శ్రీ అనంతేశ్వరి అనంతేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కైలాసనాథునికి అన్నాభిషేకం నయన మనోహరంగా సాగింది. ˇయం భక్తుల స్వహస్తాలతో స్వామి వారికి అన్నాభిషేకం, పుష్పార్చన రజిత బిల్వార్చన నిర్వహించారు. మంగళ హారతి అనంతరం అన్నాభిషేకానికి సహకరించిన మహాదాతలకు సన్మానం జరిగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కోటి దీపోత్సవం కార్యక్రమంలో 160 మంది దంపతులు పాల్గొన్నారు. రాత్రి మహా మంగళ హారతి అనంతరం అన్నప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పూజలందుకున్న శివయ్య


అన్నాభిషేకం చేస్తున్న భక్తులు


యాడికిలో కోటి సంతాకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకుడు బాల రమేష్ బాబు. పాల్గొన్న వైసీపీ నాయకులు

# మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం తగదు

## యాడికిలో బాల రమేష్ బాబు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ..

**యాడికి. నవంబర్ 9 :**
మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గారి ఆదేశాల మేరకు వైసిపి యాడికి మండల నాయకులు బాల రమేష్‌బాబు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. యాడికి మండల కేంద్రంలోని బాల రమేష్ బాబు నివాసం వద్ద ఆదివారం స్టేట్ జాయింట్ సెక్రెటరీ వెన్నపూస వెంకట్రామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవ రాయుడు,నాయకుడు నగరూరు బ్రహ్మానందరెడ్డి, కోడూరు మోహన్ రెడ్డి, చందన శివ, తదితర నాయకులు
ఈ సంతకాల సేకరణలో పాల్గొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల కలిగే నష్టాలను, పేద విద్యార్థులు పడే కష్టాలను ప్రజలకు వైస్సార్సీపీ నాయకులు బాల రమేష్ బాబు. వెంకట్రామిరెడ్డి బ్రహ్మానంద రెడ్డి మండల కన్వీనర్ సంజీవరాయుడు. వివరించారు. గతంలో మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలన లో పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ పథకంతో ఎంతో మంది ప్రజలు ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకున్నారు. అలాగే పేద విద్యార్థుల చదువుల కోసం ఫీజులు తగ్గించడం ఏర్పాటు చేశారని, వీటి వలన విద్యార్థులు చదువుకొని ఈనాడు నగరాలలో ఉద్యోగం చేస్తున్నారన్నారు. ఆయన అడుగుజాడల్లో ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 నుండి 24 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఐదు సంవత్సరాలలో రెండు సంవత్సరాలు కరోనాతో రాష్ట్రం అతలాకుతలం కాగా ప్రజల కోసం సచివాలయం వాలంటీర్ల ద్వారా సేవలందించారన్నారు. మిగతా మూడు సంవత్సరాల అధికారంలో ప్రజా సేవల కోసం వైద్యం విద్య సంక్షేమ పథకాలపై పరిపాలన సాగించారన్నారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి అందులో ఐదు మెడికల్ కాలేజీలు ప్రారంభించారన్నారు. మిగతా 12 మెడికల్ కళాశాలలో దాదాపు 70 శాతం పూర్తి అయ్యాయని వాటినే ఈ ప్రభుత్వం పూర్తి చేయకుండా ప్రైవేట్ పరవం చేయడం సరైన పద్ధతి కాదని వారు తెలిపారు. 17 మెడికల్ కళాశాలల వల్ల 17 వైద్యశాలలు అందుబాటులోకి వస్తాయని వాటి వల్ల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వారు వివరించారు. ప్రతి పంచాయితీలో సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం వలన గ్రామ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ఇది వైయస్ జగన్ చేసిన మంచిపని అన్నారు. వైసీపీ నాయకులు గ్రామాలలో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలోనూ వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ కాకుండా కోటి సంతకాల సేకరణ లో భాగంగా ప్రతి ఒక్కరూ సంతకాలు సేకరించి వాటిని నాయకుడు గవర్నర్ దృష్టికి తీసుకొని వెళ్తారని తెలిపారు. అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం ను వ్యతిరేకిస్తూ నాయకులు పోస్టర్ విడుదల చేసి సంతకాల సేకరణ నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాల రమేష్ బాబు, స్టేట్ జాయింట్ సెక్రెటరీ వెన్నపూస వెంకట్రామిరెడ్డి, నాగరూరు బ్రహ్మానందరెడ్డి, కన్వీనర్ సంజీవరాయుడు, తలారి నాగేష్, చిక్కేపల్లి అశోక్ రెడ్డి, గుడిపాడు చలమారెడ్డి, కమలపాడు భాస్కర్ రెడ్డి, చింతలయపల్లి రోషి రెడ, పంపిరెడ్డి, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి , దముత్యాలరెడ్డి, మల్లికార్జున, శివకేశవరెడ్డి, దైవాలమడుగు మోపిరెడ్డి, చందన శివ, వాసుదేవారెడ్డి, అది, కోన ఉప్పలపాడు బలగంగయ్య , రంగా, రమణ. మా హుస్సేన్. కృష్ణారెడ్డి. నారాయణరెడ్డి, దేవేంద్ర, సుదర్శన్, రుక్మారెడ్డి, రామాంజనేయులు, రామసుబ్బారెడ్డి, లక్ష్మీనాథరెడ్డి, నాగభూషణంరెడ్డి, రమేష్ రెడ్డి. ఆదినారాయణరెడ్డి.లక్ష్మీరెడ్డి రమనందరెడ్డి. కుమార్ భీమాషశ్వరరెడ్డి భాస్కరెడ్డి. నారాయణరెడ్డి, గంగన్న, లక్ష్మీనారాయణ, వెంకటశివారెడ, సుబ్రమణ్యం (అలియాస్ బాబు ), వాసు, వెంకటేష్, వడ్డే రామాంజనేయులు, కంబగిరి స్వామి, మురళి., మత్తయ్య పాల్గొన్నారు.


కోటి సంతకాల సేకరణ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం. కోటి సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

## హిందూత్వం, హిందూ ధర్మం కోసం

# పోరాడుతూనే ఉంటా..

### ప్రాణాలైనా అర్పిస్తాం..
### ప్రాణాలు తీస్తామన్నా భయపడం..
### హిందూ ధర్మాన్ని రక్షిస్తాం..
### హిందూ నేతలను అవమాన పరచిన సీఐ క్షమాపణలు చెప్పాలి..
### జై శ్రీరామ్ భక్తమండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ ..

**తాడిపత్రి, నవంబర్ 9:**
స్థానికుల సహకారంతో హిందూ ధర్మం కోసం, హిందుత్వం కోసం పోరాడుతామని, ప్రాణాలైనా ర్పిస్తామని, మా ప్రాణాలు తీస్తామన్నా భయపడమని, హిందూ ధర్మాన్ని రక్షిస్తామని జై శ్రీరామ్ భక్తమండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ అన్నారు. హిందూ నేతలను అవమానపరిచిన పట్టణ సీఐ ఆరోహణరావు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తాడిపత్రిలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జై శ్రీరామ్ భక్త మండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో అత్యధిక శాతం హిందువులు నివసిస్తున్నారని తెలిపారు. హిందువులు అధికంగా నివసించే ప్రాంతంలో అక్రమంగ చర్చి నిర్మాణం చేపట్టడంతో, నిరుపేద హిందువులను మతమార్పిడి చేయదలచిన క్రైస్తవులను కాలనీవాసులు అడ్డుకున్నారన్నారు. తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్ళామన్నారు. దీంతో వారు స్పందించి చర్చిపై నోటీసులు అతికించారని, అయితే క్రైస్తవులు ఆ నోటీసులను చించివేసి ప్రార్థనలు కొనసాగిస్తున్నారన్నారు. అంబేద్కర్ నగర్‌లో నివశిస్తున్న హిందువులు చర్చి నిర్మాణాన్ని ఆపాలని, అందుకోసం ర్యాలీ నిర్వహిస్తామని, అందుకు తమ మద్దతు కోరారని తెలిపారు. ఈనెల 8న ఈ విషయంపై చర్చించడానికి పట్టణ సీఐ ఆరోహణ రావు కానిస్టేబుల్‌ను తన నివాసం వద్దకు పంపించారన్నారు. దీంతో పదిమంది బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో సీఐ ఆరోహణ రావుని కలిశామన్నారు. సీఐ తన చాంబర్లో తమందరిని దోషులుగా నిలబెట్టి వేలాది మంది తరలిరండి అని కరపత్రాలు వేయిస్తావా, నీ బాడీ లాంగ్వేజ్ ఏం బాగాలేదు, నీ పద్ధతి మార్చుకో, నేను అందరి మాదిరి కాదని బీజేపీ, వీ.హెచ్.పీ కార్యకర్తలను దండించారన్నారు. మీ బీజేపీ నాయకులతో మాటాడాను, నీకు బీజేపీ, వీ.హెచ్.పీతో ఎటువంటి సంబంధం లేదంట కదా, నీవేమన్నా తమాషా చేస్తున్నావా, నోరు మూసుకొని ఇంట్లో కూర్చోమని హెచ్చరించారన్నారు. హైదరాబాదులో ఓవైసీకే చలానా రాసిన వాడిని, నీవెంత అని దుర్భాషలాడారన్నారు. తాము చెప్పే విషయాన్ని ఏమాత్రం వినకుండా నానా పదాలతో అవమాన పరిచారన్నారు.
2014, 2019లో 1000 మందికి బీజేపీలో సభ్యత్వాలు చేయించామని, పదవులు ఆశించి బీజేపీలో పనిచేయడం లేదన్నారు. దేశం కోసం, ధర్మం కోసం నరేంద్ర మోడీ నాయకత్వం కోసం, జిల్లా, రాష్ట్ర నాయకత్వాలను గౌరవిస్తూ సమాజం కోసం పనిచేస్తున్నానని తెలిపారు. బాల్యం నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం సభ్యుడినని, విశ్వ హిందూ పరిషత్ తాడిపత్రి నగర కార్యదర్శిగా, అనంతపురం జిల్లా అధ్యక్షునిగా, రాయలసీమ విభాగ్ అధ్యక్షునిగా పనిచేశానని ఆయన వివరించారు. 2019లో బీజేపీలో చేరానని, బీజేపీ అభ్యర్థిగా జంగంరెడ్డి అంకాల్ రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసినపుడు బీజేపీ ఎన్నికల చీఫ్ ఏజెంటుగా పనిచేశానన్నారు. దీన్ని బట్టి తాను బీజేపీలో ఉన్నట్టా, లేనట్టా మీరే చెప్పాలన్నారు.
తాడిపత్రి పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వంద చర్చిలు నిర్మాణాలు జరిగాయన్నారు. హిందువులకు అనుకూలమైన కూటమి ప్రభుత్వంలో ర్యాలీ నిర్వహించి సమస్యను ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి దృష్టికి తీసుకెళ్లి, ఏఎస్పీ ద్వారా ఆ సమస్యకు పరిష్కారం చూపాలనేదే తమ ఉద్దేశ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో ర్యాలీ చేసే హక్కు లేదా అని ప్రశ్నించారు. సీఐ తమని దోషులుగా పరిగణిస్తున్నారని, ఇదెక్కడి న్యాయమన్నారు.
ఆ కాలనీలో కేవలం ఒక్క క్రైస్తవ కుటుంబం మాత్రమే ఉందని, బయటి ప్రాంతాల నుంచి దాదాపు 20 మంది ఆ చర్చిలో కలుస్తున్నారనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా కేవలం హిందువులను మతం మార్చడానికి జరిగే కుట్ర తప్ప ఇక్కడ మరియే ప్రార్థనలు లేవన్నారు. క్రైస్తవులకు మద్దతుగా, హిందువులకు వ్యతిరేకంగా సీఐ ప్రవర్తన దారుణంగా ఉందన్నారు. తమ నివాసం సమీపంలో గత నాలుగు సంవత్సరాలుగా ఏసు కీర్తనల పేరుతో ఒక చర్చిలో అనధికారికంగా ప్రార్థనలు జరుగుతున్నాయని, తాడిపత్రి పట్టణంలో ఏటి సందులో పెద్దమ్మ గుడి వద్ద సమీపంలో మతం మారిన హిందువు ప్రతి మంగళవారం ప్రత్యేక ప్రార్థనల పేరుతో 200 మందికి చికెన్ బిర్యానీ పెట్టి ప్రార్థనలు జరుపుతున్నారని తెలిపారు. తాము ఏ తప్పు చేయకపోయినా దోషుల మాదిరి ఒక గంట సేపు పోలీస్ స్టేషన్‌లో తన ఎదుట కావాలని నిలబెట్టినందుకు బేషరతుగా సీఐ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐ పాతబస్తీకి వెళ్లి అక్కడ ఓవైసీతో, ఎలక్ట్రిసిటీ బిల్లు చెల్లించని వారితో వసూలు చేస్తే తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందే తప్ప ఆంధ్రాకు ఒరిగేది ఏమిలేదన్నారు.
భారతీయ జనతా పార్టీ ఒక పెద్ద కుటుంబమని, కుటుంబ సమస్యలను తామే పరిష్కరించుకుంటామన్నారు. పార్టీ కుటుంబ విషయాలలో జోక్యం చేసుకునే హక్కు సీఐకి లేదన్నారు. తాడిపత్రి పట్టణంలో గంజాయి, మట్కా, పేకాట క్లబ్‌లు, పట్టణ పోలీసు స్టేషన్‌లో అక్రమ వసూళ్లు జోరుగా సాగుతున్నాయని, వీటిని అరికట్టవలసిన బాధ్యత మీకు లేదా అని సీఐని ఆయన ప్రశ్నించారు. సీఐ ఆరోహణ రావు చర్యలు క్రైస్తవులకు మద్దతుగా ఉన్నాయని ఆరోపించారు. సీఐ ఆరోహణ రావు బీజేపీ, హిందూ కార్యకర్తలను అవమానపరిచిన విషయాలను మంత్రి సత్య కుమార్‌యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈకార్యక్రమంలో జై శ్రీరామ్ భక్త మండలి సభ్యులు లక్ష్మీ నారాయణ, ప్రతాప్ రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న జై శ్రీరామ్ భక్తమండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ


శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం గావిస్తున్న దృశ్యం

# శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

**తాడిపత్రి, నవంబర్ 9:**
పెన్నా నది పరివాహక ప్రాంతంలో వెలిసిన చారిత్రాత్మక శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం ఉత్సవాలలో భాగంగా19వ రోజు ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుఝామున 3గంటలకే శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ పూలమాలలతో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మహా చండీ హెూమం చేపట్టారు.


మహా చండీహెూమం నిర్వహిస్తున్న దృశ్యం

# శ్రీ కేంచమాంబదేవికి కార్తీక అభిషేకాలు

**అమరాపురం, నవంబర్ 9:**
మండల పరిధిలో తమ్మడేపల్లి పంచాయితీ గౌడనకుంట గ్రామంలో వెలసిన కే%శీ% చమాంబా దేవి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా శ్రీ కేం చమాంబా దేవికి అభిషేకం, కుంకుమార్చన, తమలపాకు పూజ, పంచామృత అభిషేకం వివిధ రకాల పూజలు అర్చకులు చిదానంద స్వామి నిర్వహించారు. భక్తులు తెచ్చిన పూలతో అమ్మవారిని అలంకరణ చేసి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుండి అమ్మవారి అలంకరణ చూడడానికి భక్తులు తరలివచ్చారు.


శ్రీ కెంచమాంబ దేవికి దేవికి తమలపాకు అలంకరణ


కడ్లే గౌరమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రజలు

# ఘనంగా కడ్లే గౌరమ్మ మహెూత్సవాలు

**కనేకల్ నవంబర్ 9 :**
మండలంలో ఘనంగా కడ్లే గౌరమ్మ దీపారాధన మహెూత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. అమ్మవారిని వివిధ ప్రాంతాలలో మూడు రోజుల నుండి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి ప్రతి మా విగ్రహాన్ని ట్రాక్టర్లలో వివిధ రకాల పూలతో విద్యుత్ కాంతుల వెలుగులో ఊరేగింపుగా పురవీధుల గుండా కోలాహలంగా నిర్వహించారు. ఊరేగింపు సమయంలో మంగళ వాయిద్యాలు,డప్పుల వాయిద్యాల మధ్య టపాసులు పేలుస్తూ యువత కేరింతలతో ఉత్సాహంగా ఊరేగింపు కొనసాగింది. ఊరేగింపు సమయంలో కన్నెపిల్లలు మహిళలు అమ్మవారికి హారతులు పట్టారు. అదేవిధంగా మండల పరిధిలోని ఎర్రగుంట జక్కులవడికి, గనిగేరా, సొల్లాపురం,హనుమాపురం, హనకనహల్, మాల్యం తదితర గ్రామాలలో సైతం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపులు కొనసాగించారు అనంతరం శ్రీ చిక్కనేశ్వర స్వామి చెరువులు నిమజ్జనం చేశారు.


పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న కడ్లే గౌరమ్మ



రోడ్డు పక్కగా ఒరిగిపోయిన కంటైనర్ లారీ

## కంటైనర్ లారీకి తప్పిన పెను ప్రమాదం

**బత్తలపల్లి, నవంబర్ 9:** అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లిలో ఆదివారం కంటైనర్ లారీకి పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇఆల ఉన్నారు. అనంతపురం వైపు నుంచి రెండు కంటైనర్ లారీలు ఒక్కొ లారీలో పది ట్రాక్టర్లు తీసుకొని చెన్నైకు వెళ్తున్నాయి. బత్తలపల్లి సమీపంలోకి రాగానే బైపాస్ రోడ్డులో వెళ్లాల్సిన లారీలు అలా కాకుండా ఊరిలోకి వస్తున్నాయి దీంతో లారీ డ్రైవర్లు అప్రమత్తమై లారీని వెనుకకు నడుపుతుండగా కొద్దిగా రోడ్డు వైపుకు దిగి ఒదిగిపోయింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే లారీని నిలిపివేశాడు. తరువాత పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో లారీని బయటకు తీసి రోడ్డుపై నిలిపారు. దీంతో అందరూ ఊప్పి పీల్చుకున్నారు. అయితే ఎవరికి ఎలా ప్రాణా పాయం జరగలేదు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# కష్టాల కడలిలో అన్నదాత

### అరటి పంటకు గిట్టుబాటు ధర లేక రైతన్నల ఆవేదన
### ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి
### సిపిఐ మండల అధ్యక్షుడు బి.కె లక్ష్మీనారాయణ..



గిట్టుబాటు ధరలేని అరటిపంటను చూపుతున్న రైతన్న

**బత్తలపల్లి నవంబర్ 9 :** అరటి పంటకు తగిన గిట్టుబాటు ధర లేక రైతన్నలు అష్ట కష్టాలు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతన్నలను ఆదుకోవాలని సిపిఐ పార్టీ మండల అధ్యక్షులు బి కే లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తాడిమర్రి మండల పరిధిలోని అరటి రైతులు సంవత్సరాల తరబడి ఎన్నో ఆశలతో, అప్పులు చేసి, ఎరువులు, మందులు వాడుతూ పంట సాగు చేసిన రైతులకు, పంట చేతికందే సమయానికి గిట్టుబాటు ధర లేక అష్ట కష్టాలు పడుతున్నారని సిపిఐ పార్టీ మండల అధ్యక్షులు బి.కే లక్ష్మీనారాయణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ?మండలంలోని ప్రతి గ్రామంలోనూ రైతులు అరటి పంటను నమ్ముకుని సాగు చేశారు. పెట్టుబడులు లక్షల్లో పెట్టి, అధిక దిగుబడి కోసం రేయింబవళ్లు కష్టపడినప్పటికీ, మార్కెట్‌లో ధర పలకకపోవడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవు తున్నారు. పిన్నదరి గ్రామానికి చెందిన రైతులన్నలు హరి, లోకేశ్వర్ నాయుడు పరిస్థితి మరింత దయనీయం. పోయిన సంవత్సరం గాలి వాన బీభత్సానికి వారి అరటిపంట పూర్తిగా నేలపాలై తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరమైనా మంచి ధర వస్తుందనే ఆశతో మళ్లీ అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు కానీ, దురదృష్ట వశాత్తూ, ఒక టన్ను అరటిని రెండు వేలకు ఇస్తామన్నా కూడా కొనేవారు రాకపోవడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతులు పడుతున్న ఈ భరించలేని బాధలను అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పంట పెట్టుబడులు కూడా దక్కని ఈ పరిస్థితులను అంచనా వేసి, వాస్తవ నివేదికను ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు.

## వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరా

**రొళ్ల, నవంబర్ 9 :** సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నగిరి కృష్ణాజిరావు మనమరాలు అమృత ఓణి వేడుక కార్యక్రమంలో మాజీ మంత్రి మాజీ ఏపీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత సిడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్.ఎన్.రఘువీరారెడ్డి హాజరై అమ్మాయిని ఆశీర్వదించారు. అనంతరం అతని ఇంటిలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి పూజలో పాల్గొని పూజలు నిర్వహించి ప్రసాదం స్వీకరించారు. అనంతరం వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ డాక్టర్ గౌడప్ప,మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ, నాయుకులు న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, రంగాపురం జగన్నాథ్ ,పాండురంగారెడ్డి, హనుమంతరాయప్ప, ఆశిఫ్, గంగారాం, తిమ్మప్ప, గంగప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి



నాయకులతో ముచ్చటిస్తున్న రఘువీరారెడ్డి





పల్లెల్లో కోటిసంతకాలు సేకరిస్తున్న వైసీపీ నాయకులు

## కోటి సంతకాల సేకరణ
### వైసీపీ నాయకులు.....

**తనకల్లు, నవంబర్ 9:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తనకల్లు మండల పరిధిలోని ముండ్లవారిపల్లి పంచాయతీలోని భీమ్లా నాయక్ తాండా ,సుబ్బరాయన పల్లి, భూలే నాయక్ తాండా,పి ఆర్ తండాలలో తనకల్లు మండల కన్వీనర్ మబ్బు అశోక్ వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు రమేష్ నాయక్,అంజి నాయక్, పి ఆర్ తండా రమేష్ నాయక్, శంకర నాయక్,మురళి నాయక్ చిట్టెమ్మ,వెంకట రమణ నాయక్,హరి నాయక్ ,గోపాల్ నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నందరాజనపల్లిలో కొంతెమ్మ నిమజ్జనం

**అగళి, నవంబర్ 9 :** మండల పరిధిలోని నందరాజనపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ యువతులు మహిళలు చందాలు వేసుకుని మాజీ సర్పంచ్ నింగన్న సహకారంతో కార్తీక మాసం సందర్భంగా గౌరీదేవి,కొంతెమ్మ ను ప్రతిష్టించారు.గత15 రోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రతిరోజు నిత్య పూజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గౌరీదేవిని నిమజ్జనం చేశారు. ఆదివారం కొంతెమ్మను భక్తి పాటలు పాడుతూ మహిళలు ఒక్కొక్కరుగా అమ్మ వారిని తలపైన మోస్తూ నృత్య నాట్యాలు చేసుకుంటూ బ్యాండు వాయిద్యాలు నడుమ గ్రామంలో వాడవాడలా ఊరేగింపుగా వెళ్ళి మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం నీళ్లలో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ యువకులు ఆనిమేటరీ రామన్న, జగదీష్,రంగనాథ్, రవి,మహిళలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



కొంతెమ్మను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు



కొంతెమ్మను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

## సమస్యల పరిష్కారమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం
### ఘనంగా న్యాయ సేవాధికార దినోత్సవం..

**హిందూపురం, నవంబర్ 9:** సామరస్యంగా సమస్యలను పరిష్కరించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని అదనపు జిల్లా జడ్జి కంపల్లి శైలజ, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం, కస్తూర్బా బాలికల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే న్యాయసేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇరు వర్గాలు కలిసి వస్తే కేసులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చిన్నపాటి తగాదాలు, ఘర్షణల విషయంలో పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురి కాకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చున్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, ఎవరికి ఎలాంటి మినహాయింపులు ఉండమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకొని ముందుకెళ్లాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఎలాంటి ఫీజులను చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ఎలాంటి వ్యక్తిగత, సామాజిక సమస్యలను అయినా న్యాయ సేవాధికారి సంస్థ దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం కూడా ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువు పట్ల దృష్టి సారించి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించి చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకొని సమాజంలో మెలగాలన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యాభ్యాసం సాగించాలన్నారు. అలాంటి వారిని పనుల్లో ఉంచుకోవడం కూడా నేరమన్నారు. దీనికి తోడు 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు. ఇందులో భాగంగా న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యాలను వివరించారు. అనంతరం ఏ ఏడీజే శైలజ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల కోసం తయారుచేసిన ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శన్, మురళి, రవిచంద్ర, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, లోక్ అదాలతో సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్లు, ఆయా హాస్టల్ వార్డులు తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఏడిజే శైలజ




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఆంజనేయస్వామి

## ఘనంగా ఆంజనేయ స్వామి కార్తీక మహోత్సవం
### జడ్పీటీసీ అనంతరాజు ..

**రోళ్ల, నవంబర్ 9 :** మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి కార్తీక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవలు అంకురార్పణ పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా గంగాజలంతో మూలవిరాట్ ను శుభ్రపరిచి వివిధ పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తితో పాటు రామ లక్ష్మణ సీతా దేవిని వివిధ పూలమాలతో ప్రత్యేకంగాలంకరించి రథంలో ఉంచిపూజలు నిర్వహించారు. తో పాటు గ్రామస్తులు పురవీధుల గుండా జైశ్రీరామ్ నామ స్మరణతో రథాన్ని లాగారు.కార్తీక మహోత్సవానికి జడ్పీటీసీ అనంతరాజు,గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జడ్పీటీసీ అనంతరాజు ని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.



జడ్పీటీసీ అనంతరాజుని సన్మానిస్తున్న గ్రామస్తులు

# వైభవోపేతంగా శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**బత్తలపల్లి, నవంబర్ 9 :** మండలంలోని అనంతసాగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆలయం, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీ రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టను వైభవోపేతంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా వేడుకలను ఆలయ కమిటి సభ్యులు. గ్రామ పెద్దల. ఆధ్వర్యంలో అర్చకులు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ఆరుగురు పండితులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీ రామలింగేశ్వరస్వామి. పార్వతి, వినాయక, కుమారస్వామి, నంది. ధ్వజ స్తంభం మూల విగ్రహ ప్రతిష్ట మహోత్సవములను వైభవోపేతం గా నిర్వహించారు. యంత్ర ప్రతిష్ట. విగ్రహ ప్రతిష్టా హెూమము, ప్రాణ ప్రతిష్ట రూగ్ని జ్వాల మహా పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.మహా పంచామృత అభిషేక దివ్యలాంకర పూజ, మహాగర్భలయాల ద్వారా ఉద్ఘాటనతో పాటు శ్రీమహాగణపతి శ్రీరామలింగేశ్వరస్వామి దృష్టి నిరీక్షతో పాటు దివ్య దర్శన, మంత్ర పుష్ప మహానివేదన మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉదయం 12 గంటలు నుంచి సాయంత్ర 5 గంటల వరకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. ప్రతిష్ట అనంతరం రాత్రి వరకు స్వామి దర్శనం కల్పించారు. ఈ వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటి సభ్యులు. గ్రామస్థులు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రతిష్టించిన శ్రీ రామలింగేశ్వర స్వామి



దాత సిద్దేగౌడ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## అమ్మాజీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. పది లక్షల విరాళం
### విశ్రాంత ఉద్యోగి సిద్దేగౌడ్‌కు సన్మానం ..

**రోళ్ల, నవంబర్ 9 :** మండల పరిధిలోని జీరిగేపల్లి గ్రామంలో వెలసిన అమ్మాజీ దేవాలయం ఆవరణంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనం నిర్మాణానికి తనవంతు సహాయంగా కర్ణాటక రాష్ట్రం కనకపూర్ తాలూకా నాగఅరసన కోటి గ్రామవాసులు రిటైర్డ్ ఎస్క్యూటివ్ ఇంజనీర్ సిద్దేగౌడ్ ఆదివారం అర్చకులకు పది లక్షలు చెక్ ను అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామస్థులు దాతను ఘనంగా సన్మానించారు.

# నూతన శివలింగం, నంది విగ్రహం ప్రతిష్ఠ

**అమరాపురం, నవంబర్ 9:** మండల పరిధిలోని తముడేపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ శివ చిత్ర లింగేశ్వర స్వామి శ్రీ ఎత్తప్ప స్వామి దేవాలయంలో ఆదివారం వైభవంగా గంగపూజ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలతో మహిళలు ఆలయం నుంచి డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా సమీపంలో ఉన్న వంక వద్ద ఏకంగా స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు .అనంతరం ఆలయం వరకు ఊరేగింపుగా కళాశాలతో తిరిగివచ్చి ఆలయం చేరుకున్నారు. సాయంకాలం ఆలయ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమాలు శ్రీ కృష్ణ సేవా సమితి, అన్నదమ్ములు 12 కైవాడస్తులు, గ్రామస్తులచే నిర్వహించారు. ఈనెల 10న ఉదయం బ్రాహ్మిని ముహూర్తం నందు శివలింగం, నంది, విగ్రహం, నగర ప్రతిష్టాపన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.



శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామి శ్రీ ఎత్తప్ప స్వామి దేవాలయం.





కళాశాలకు పూజలు నిర్వహించిన దృశ్యం. కళాశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## ఆపదమిత్ర మాస్టర్ ట్రైనర్‌గా రత్నగిరి పరమేష్ ఎన్నిక

**రొళ్ల, నవంబర్ 9 :** జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలు సమన్వయంతో ఒరిస్సాలోని భువనేశ్వర్లో ఒరిస్సా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో గత 21 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆపదమిత్రలు 52 మందికి "ఆపదమిత్ర మాస్టర్ ట్రైనర్"గా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో మన శ్రీ సత్య సాయి జిల్లా రొళ్ల మండలం రత్నగిరి గ్రామం నుండి ఆపదమిత్ర పరమేష్ పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ సదావకాశం జిల్లా స్థాయిలో నాకు రావడం చాలా ఆనందంగా ఉందని ఆయన హార్షం వ్యక్తం చేశారు..



లఆపద మిత్ర నియామక పత్రాన్ని అందుకొంటున్న పరమేష్





శిక్షణ పొందుతున్న పరమేష్

## సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు

### ఎమ్మెల్సీ బీటీ నాయుడు ..

**పెద్దకడబూరు, నవంబర్ 9 :**
కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని ఎమ్మెల్సీ బీటీ నాయుడు స్పష్టం చేశారు. ఆదివారం పెద్దకడబూరు గ్రామంలోని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కోడిగుడ్ల ఏసేపు మనవరాలు రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని వెల్లడించారు. రాష్ట్రంలోని పేదలకు మరింత మెరుగైన వైద్య విద్యను, ఉచిత వైద్యాన్ని అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీనిపై వైసీపీ చేస్తున్న ఆందోళన సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ నాయకులు కోడిగుడ్ల జయపాల్, కోడిగుడ్ల దుబ్బన్న, పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ బీటీ నాయుడిని సన్మానించిన టీడీపీ నాయకులు

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పాదయాత్ర

**పెద్దకడబూరు, నవంబర్ 9 :**
గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్దకడబూరు నుంచి ఆదోని పట్టణానికి ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు శ్రీనివాసులు, దేవదాసు, రాజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీఎస్ కుడి కాలువ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. పులికనుమ ప్రాజెక్టు ద్వారా పెద్దకడబూరు మండలానికి సాగునీరు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. గురు రాఘవేంద్ర లిఫ్ట్ ద్వారా మాధవరం లిఫ్ట్ కు, సూగూర్ లిఫ్ట్ కు, బసలదొడ్డి లిఫ్ట్ ద్వారా సాగునీరు, తాగునీరు అందించాలని తెలిపారు. మంత్రాలయం, పెద్దకడబూరు మండలాలకు సాగునీరు, తాగునీరు అందించాలని, రోడ్లు, విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా మండలాల్లో వలసలు నివారణకు ఉపాధి హామీ పనులను కల్పించాలన్నారు. పెద్దకడబూరు మండలంలో 26 గ్రామాలకుగాను కేవలం 10 గ్రామాలకు మాత్రమే రక్షిత మంచినీరు సరఫరా అవుతుందన్నారు. మిగిలిన గ్రామాల ప్రజలు ఇప్పటికీ ఫ్లోరైడ్ నీటినే తాగుతూ పలు జబ్బుల బారిన పడుతున్నారని తెలిపారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్దకడబూరు నుంచి ఆదోని వరకు పాదయాత్ర చేపట్టిన సీపీఎం నాయకులు

## న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

### శ్రీకాకుళం జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు తేజేశ్వరరావు ..



**ఎల్ఎన్ పేట , నవంబర్ 9:**
మరణించిన న్యాయవాది కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు శివ్వాల.తేజేశ్వర రావు తెలిపారు.ఆదివారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మరణించిన 1150 మంది న్యాయవాదులను ఆదుకునేందుకు 46 కోట్ల రూపాయల మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసిందని తెలిపారు. ఒక్కొక్క న్యాయవాది కుటుంబానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు.ఈ మేరకు విడుదల చేసిన మ్యాచింగ్ గ్రాంట్ ఎపీ వెల్ఫేర్ ఫండ్ పేరుతో చెక్కు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. న్యాయవాదులు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం పట్ల కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు,యువ నాయకులు నారా.లోకేష్ కు ఆయన ధన్యవాదములు తెలిపారు.

## న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్‌లో సయ్యద్ జైన్ అష్రఫ్‌కు బంగారు పతకం

**హైదరాబాద్, నవంబర్ 9:**
హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్‌లో సంవత్సరపు పిల్లలకు నిర్వహించిన బేబీ క్రాలింగ్ రేసులోసయ్యద్ జైన్ అష్రఫ్ మొదటి స్థానం దక్కించుకుని గోల్డ్ మెడల్ పొందాడు. డా.జావేద్ అష్రఫ్, డా. షాహిరా పుత్రుడైన అష్రఫ్ అరుదైన రికార్డు సాధించారు. అష్రఫ్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఖాజా మొహియుద్దీన్ మనవడు. గతంలో 3 నెలల వయసులో నిర్వహించిన వెల్ బేబీ షోలో ఈ బాబు ప్రథమ బహుమతి దక్కించుకున్నాడు.


సయ్యద్ జైన్ అష్రఫ్



న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్‌లో పాల్గొన్న సయ్యద్ జైన్ అష్రఫ్.
బంగారు పతకం అందుకున్న సయ్యద్ జైన్ అష్రఫ్‌తో తల్లిదండ్రులు

## అట్టహాసంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పెద్దకడబూరు, నవంబర్ 9 :**
మంత్రాలయం మండల పరిధిలోని విద్యానగర్ లోని ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1991- 92 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎస్ఎం లక్ష్మిరెడ్డి అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. మూడు దశాబ్దాల తరువాత తమ గురువులను, స్నేహితులను, పాఠశాలను మళ్లీ చూడటానికి పూర్వ విద్యార్థులు దూర ప్రాంతాలను నుంచి వచ్చారు. దీంతో వారిలో ఒక్క క్షణ కాలం వెనక్కి వెళ్లినట్లు అందరి ముఖాల్లో బాల్యానందం మెరిసింది. తమ విద్యార్థి దశ అనుభవాలను, గురువుల పట్ల ఉన్న కృతజ్ఞతను స్మరించుకున్నారు. పాఠశాల మాకు విద్యనే కాదు విలువలను కూడా నేర్పిందని, అదే మన జీవిత విజయానికి మూలాధారమని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనైయ్యారు. పాఠశాల అభివృద్ధి పట్ల తమ వంతు బాధ్యతగా సైన్స్ ల్యాబ్ పరికరాలు, సోషల్ కు సంబంధించిన వస్తువులను పాఠశాలకు అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు ఎస్ఎం. సాదుల సత్యనారాయణ రెడ్డి, నారాయణ రెడ్డి, ఎస్ఎం. శ్రీధర్ రెడ్డి, భారతమ్మ, గోపాల్ రెడ్డి, నాగేశ్వరి, ఎస్టీ ఈరన్న, దుంపాల వీరేష్, మరియు ప్రస్తుత ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి వేదికను సిద్ధం చేస్తున్న పూర్వ విద్యార్థులు.
పూర్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

## పేదలకు వైద్యం అందకుండా చేసిన చంద్రబాబు

### మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి..

**ఆదోని, నవంబర్ 9:**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ పేదలకు వైద్యం అందకుండా చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నవంబర్ 12వ తేదీ జరిగే మెడికల్ కాలేజీల ఆందోళనలో భాగంగా ఆదివారం రోజు మెడికల్ కాలేజీ ఆందోళన వాల్పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రకాంత్ రెడ్డి, శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైకాపా నాయకులు జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు వైద్యం అందించాలని రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసే ఐదు మెడికల్ కాలేజీలను పూర్తి చేయడం చేశారని అన్నారు. అయితే ఇంకా 13 కాలేజీలో నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయని స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వమయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం భూములను ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, కాలేజీలలో నిర్మాణం పనులు కూడా చేపట్టి నిర్మాణం పనులు సాగుతున్న దశలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెడికల్ కాలేజీలో నిర్మాణాన్ని నిలిపివేసి వాటిని ప్రవేట్ పరం చేయడానికి పూనుకోవడం చాలా దారుణమని అన్నారు. ప్రైవేట్ కాలేజీలను చేయటం వల్ల పేదలకు డబ్బులు ఇవ్వకపోతే వైద్యం అందదని, అలాగే పేద



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

విద్యార్థులు వైద్య విద్య అందకుండా పోతుందని సాయి ప్రసాద్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కాలేజీలలో పి పి విధానంలో నడుపుతున్నట్లు ప్రకటించడం వలన ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. అందువల్లనే ప్రైవేట్ పరం చేయరాదని మెడికల్ కాలేజీ లను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ పెద్ద ఎత్తున వైకాపా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన దశలవారీగా సాగిస్తున్నామని అన్నారు. నెల 12వ తేదీన మెడికల్ కాలేజీ ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నామని అందువల్ల వైకాపా కార్యకర్తలు, నాయకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

### కార్తీకదీపాలు వెలిగించిన భక్తులు

**శ్రీశైలం, నవంబర్ 9:**
శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మూడవ ఆదివారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకొని పవిత్ర పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు వేకువ జాము నుండే భక్తులు క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. భక్తుల రద్దీకి అనుకూలంగా ఆలయ అధికారులు ఆలయ వేళలో మార్పులు చేసి సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం రావటంతో క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వారు పాలు, అల్పాహారం అందించారు.భక్తులు కార్తిక దీపాలను వెలిగించుకునేందుకు దేవస్థానం వారు గేట్ నెంబర్ 4, గుడి ముందు భాగంలో గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు . సుమారు 60, 000 మంది పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా.


స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచి ఉన్న భక్తులు


క్యూలైన్లలో ఉన్న భక్తులకు ప్రసాదం, పాలు అందిస్తున్న దృశ్యం

## ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం

### అట్టహాసంగా సీపీఐ కార్యాలయం ప్రారంభం

**పెద్దకడబూరు, నవంబర్ 9:**
ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ అన్నారు. ఆదివారం పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్ అధ్యక్షతన సీపీఐ పార్టీ కార్యాలయం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే స్థానిక ఎన్నికల్లో యువత పోటీ చెయ్యాలన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి చట్టాలను అవగాహన చేసుకోవాలన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టి అధికారంలోకి వస్తుంది తప్ప యువతకు ఉపాధి కల్పించి అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉందని, అక్కడ యువత విద్య, వైద్య రంగంలో ముందు ఉన్నారని, కానీ దేశం మాత్రం వెనుకబడి ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గల్లీ, గల్లీలో వైన్ షాపులను తెరుస్తూ యువతను మత్తుకు బానిస చేస్తుందని తెలిపారు. దేశంలో అన్యాయాలను అరికట్టాలంటే యువత రాజకీయాల్లోకి వచ్చి దేశాన్ని అభివృద్ధి చేసేందుకు పోరాటాలు చేయాలన్నారు. గ్రామంలోని పార్టీ కార్యాలయంలో యువత పుస్తకాలు చదివి తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, సిపిఐ పార్టీ సభ్యులు రాజు, సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర, తిక్కన్న, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు షేక్ హజరత్ భాషా, మండల కార్యదర్శి షేక్షావలి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు షేక్ మహ్మద్ హుస్సేన్, మండల సహాయ కార్యదర్శి షేక్ అల్లా భకాష్, నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, డోలు హనుమంతు, రెక్కల గిడ్డయ్య, ఇర్ఫాన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


సీపీఐ కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

### ఎస్సై రమేష్ రెడ్డి..

**కోసిగి, నవంబర్ 9 :**
కోసిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని, వివిధ గ్రామాలలో ఉన్న రౌడీషీటర్లు, అనుమానిత షీటర్లను ఎస్సై రమేష్ రెడ్డి ఆదివారం నాడు పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలోఉన్న ఎవరైనా రౌడీషీటర్లు ఎలాంటి విబేదాలు గొడవలు, లేదా అవాంఛనీయ సంఘటనలు జోలికి వెల్లకుండా జాగ్రత వహించాలని సూచించారు. అ భవిష్యత్‌లో ఎలాంటి చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడినా లేకా ప్రేరేపించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్ హెచ్చరించారు. శాంతిభద్రతల కు విఘాతం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో ఇబ్బంది పాల్గొన్నారు.


రౌడీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రమేష్ రెడ్డి

## ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

**రామకుప్పం, నవంబర్ 9:**
కుప్పం నియోజకవర్గ ఎస్సీ ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కృష్ణ నాయక్ జయశంకర్ లను కూటమినేతలు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఉన్సిగానిపల్లి లో దుశ్యాలవాలు, పూలమాలలు వేసి ఘనంగా అభినందనలు తెలిపారు. మండలంలో ఎస్సీ ,ఎస్టీల అగ్రవర్ణ కులాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్లు రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి, నేతలు మనీష్ ,సుభాష్, మహేంద్ర నాయుడు, బీరప్ప గౌడు,షణ్ముగం, మంజునాథ చారి, కృష్ణారెడ్డి, కేశవులు, గోపాల్ రెడ్డి, శంకరాచలం, రామలింగం పాల్గొన్నారు.


ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నేతలు

## టిడిపి సీనియర్ నేత మృతికి ఘన నివాళి

**రామకుప్పం,నవంబర్ 9:**
మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గడ్డురు గ్రామానికి చెందిన రెస్కో డైరెక్టర్ సతీష్ తండ్రి మునివెంకటప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టిడిపి నేతలు ఆయన భౌతిక గాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్రిస్టర్ ఇంచార్జ రవి రెడ్డి, కడ సభ్యుడు రఘు, నవీన్, చంద్రశేఖర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, మురళీధర్, గిరి, సురేష్, కే వెంకటరమణ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.


మునివెంకటప్ప మృతదేహం వద్ద నివాళులు అర్పించిన నేతలు

## గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ

### *618 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరు..*

**ఎల్ఎన్ పేట, నవంబర్ 9:**
కూటమి ప్రభుత్వం లో లక్ష్మీ నర్సు పేట మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ .మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించిన 618 లక్షల రూపాయలతో 13 పనులకు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు.దీంతో తారు రహదారులు గా అభివృద్ధి చేయనున్నారు.మండలంలోని బసవరాజు పేట గ్రామం నుండి ఎల్ ఎన్ పేట రహదారి కి,అలికాంబిబత్తిలి ఆర్ అండ్ బి రహదారి నుండి చిన్న కొల్లి వలస ఆర్ అండ్ ఆర్ కాలనీ, కొమ్ము వలస గ్రామాలు గుండా గొట్టిపల్లి కి ఎఫ్ డి పేట జంక్షన్ నుండి జాడుపేట,బిడ్డికపేట గ్రామాల గుండా కోతి గార్లపాడు గిరిజన గ్రామానికి,అలికాం- బత్తిలి ఆర్ అండ్ బి రహదారి నుండి ముంగెన్నపాడు కు తారు రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు.గత కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడ తో రహదారులు పూర్తి గా శిధిలావస్థకు చేరుకొని రాళ్ళు తేలి పెద్ద గుంతలు తయారై వర్షాలకు నీటితో నిండి పాదచారులు వెళ్లలేని పరిస్థితిలతో అత్యవసర సమయం అంబులెన్స్ నెలకొన్నాయి.ఇలాంటి పరిస్థితులు నడుమ రహదారి కష్టాలు ఎదుర్కొంటున్న ఆయా గ్రామాల ప్రజలకు రహదారులు అభివృద్ధి చేయడం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఎఫ్ డి పేట రహదారి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు బోవిల్ల.అమర్నాథ్ రెడ్డి

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి

**బద్వేల్ నవంబర్ 9:**
కడప నగరం దేవుని కడప రోడ్డు ఆర్ ఎల్ టి కళ్యాణ మండపంలో శనివారం రాత్రి తుంగా వెంకటరమణ ,రామ సుబ్బమ్మల కుమార్తె నాగజ్యోతి, భరద్వాజ కళ్యాణ మహోత్సవంలో అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బోవిల్ల.అమర్నాథ్ రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యం, దుద్దుకూరు చంద్ర, దివంగత ఇరువురి రామయ్య కుమారుడు కుమార్, కోటపాటి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు. నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

## గృహప్రవేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి

**బద్వేల్, నవంబర్ 9:**
మంచూరు నూతన గృహప్రవేశంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు పాల్గొన్నారు. శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం అధ్యక్షుడు పేర్ల జనార్ధన్ ఆర్యవైశ్య వర్తక సంఘ సెక్రెటరీ ఉరిమి శ్రీనివాసులు, ఆర్యవైశ్య వర్తక సంఘం గౌరవ సభ్యులు కొండపల్లి వెంకట సుభాష్ కుమార్, ఆర్యవైశ్య వర్తక సంఘం ఉపాధ్యక్షులు జూటూరు నాగరాజు, జాయింట్ సెక్రెటరీ బెస్తమల్ల సునీల్, శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం సెక్రెటరీ నాగేశ్వరరావు కమిటీ సభ్యులు దేవతి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



మంచూరు గృహప్రవేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి

## బిజెపిలో చేరిక

**బద్వేల్, నవంబర్ 9:**
బద్వేల్ పట్టణంలోని 13వ వార్డుకు చెందిన షేక్ దావూద్, 33వ వార్డుకు చెందిన యారవ సురేష్ బాబు బిజెపిలో చేరారు. భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలిశెట్టి పవన్ కుమార్, భారతీయ జనతా పార్టీ బుద్వేల్ పట్టణ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య రాయల్ ఆధ్వర్యంలో బీజేవైఎం కడప జిల్లా సెక్రెటరీ సురేంద్ర సీనియర్ నాయకులు కొలిశెట్టి రమణయ్య, సతీష్ కుమార్ రెడ్డి సూచన మేరకు భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ , భారతీయ జనతా యువమోర్చా కడప జిల్లా జనరల్ సెక్రెటరీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.



నాయకులకు కండువా కప్పి బిజెపిలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

## వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర సాధికార కన్వీనర్ విఎం పాండురంగప్ప

**రోళ్ల, నవంబర్ 9 :**
మడకశిర నియోజకవర్గం రోళ్ల మండలం హనుమంతనపల్లికి చెందిన మాజి స్టోర్ డీలర్ మారన్న స్వగృహంలో జరిగిన సీమంతం వేడుకల్లో రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికర సమితి కన్వీనర్ వి ఎం పాండురంగప్ప పాల్గొన్నారు. ఈసందర్భంగా అక్షింతలు వేసి ఆశీర్వాదించారు. విఎం పాండురంగప్ప ను మారన్న ఘనంగా సత్కరించారు.



వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ విఎం పాండురంగప్ప

# చల్లా రాజగోపాల్ సేవాగుణం

### పేదింటి పెళ్లిలో భోజనాలు.. చల్లాకు కృతజ్ఞతలు తెలిపిన జీరుగాల్ల కుటుంబ సభ్యులు..

**ప్రొద్దుటూరు, నవంబర్ 9:**
సేవా తత్పరుడు, అన్నదాత, పేదల పెన్నిధి,పట్టణ టిడిపి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆదివారం మరోసారి ఆయన తన సేవా గుణాన్ని చాటుకున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రతి శనివారం మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద, కొర్రపాడు రోడ్డు పాత బస్టాండ్ లో, ప్రతి నెలా పౌర్ణమి రోజున స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషను సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఎందరో పేద ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్న విషయం విధితమే. అదే విధంగా ఎవరైనా పేదవారి వివాహ సమయంలో కూడా పలు రకాలుగా సహాయం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం



వధూవరులతో పట్టణ టిడిపి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చల్లా రాజగోపాల్ యాదవ్, తదితరులు

ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె పంచాయతీలోని ఈశ్వర్ రెడ్డి నగర్ వాస్తవ్యులు జీరుగాల్ల పాములేటి కుమారుడు నరసింహ, వెంకట లక్ష్మీ వివాహం మండలంలోని నరసింహాపురం గ్రామంలో వున్న లక్ష్మీనరసింహాస్వామి వారి ఆలయంలో జరుగగా వరుని కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు చల్లా రాజగోపాల్ యాదవ్ దాదాపు 250 మందికి భోజనాలు వితరణ చేశారు. అంతేకాక ఆయనే స్వయం గా వివాహానికి విచ్చేసి పెళ్లి వారికి భోజనం వడ్డించడం ప్రశంసించదగ్గ విషయం. ఈ సందర్భంగా వధూవరుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి దాన గుణం కలవారు ఊరికి ఒక్కరు ఉన్నా చాలు అని వారు ప్రశంసించారు. ప్రొద్దుటూరు పట్టణంలో చాలా కాలంగా ఎలాంటి లాభ పేక్షను ఆశించకుండా పేదలే తన ఆత్మ బంధువులు అనే కోణంలో ఆయన ఆలోచిస్తూ ఈ లాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకం అని వారు కొనియాడారు. ఆయనను ఆ దేవుడు చల్లగా చూడాలని, ఇదే విధంగా ఆయన దానగుణం పది కాలాల పాటు కొనసాగాలని ఆశిద్దాం అని వారు ప్రశంసించారు.

# మంచూరు నూతన గృహప్రవేశ వేడుకలు

### హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..

**బద్వేల్ నవంబర్ 9:**
బద్వేల్ నియోజకవర్గంలో ప్రజా నాయకుడిగా చెరగని ముద్ర వేసుకున్న ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నూతన గృహప్రవేశ వేడుకలు ఆదివారం బద్వేల్ పట్టణం ఎన్జీవో కాలనీలో జరిగాయి. ఈ వేడుకల్లో రాయలసీమ జిల్లాల నుండి టిడిపి ఎంపీలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రైల్వే కాంట్రాక్టర్లు, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్చార్జ్ యువ నాయకుడు రితేష్ రెడ్డి, "ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, , పుత్తా సుధాకర్ యాదవ్, వరదరాజుల రెడ్డి, మాధవి రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, బండారు శ్రావణి శ్రీ ,ఎమ్మెస్ రాజు, సురేంద్రబాబు, ప్రసాద్, తదితరులు హాజరయ్యారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీలు రామ గోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్"మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి తదితరులు పాల్గొని మంచూరు సూర్యనారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.



డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్చార్జ్ యువ నాయకుడు రితేష్ రెడ్డి



డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి నూతన గృహప్రవేశ వేడుకల్లో నాయకులు

గృహప్రవేశానికి వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సూర్యనారాయణ రెడ్డి బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పూల మాలలతో, ప్రత్యేక గిఫ్టులతో ఘనంగా సత్కరించారు.
సూర్యనారాయణ రెడ్డి రాబోయే రోజుల్లో అత్యంత ఉన్నత పదవులు పొంది బద్వేల్ నియోజకవర్గానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని అతిథులు కోరుకున్నారు. నూతన గృహప్రవేశానికి నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు. భారీఎత్తున సుమారు పదివేల మందికి విందు భోజనం ఆరగించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల జడ్పిటిసి మా రెడ్డి లతా రెడ్డి, గోపవరం జడ్పిటిసి ఎల్లారెడ్డి, అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, అట్లూరు మండల సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు బోవిల్ల. నందగోపాలరెడ్డి, మాజీ ఎన్జీవో సంఘ అధ్యక్షులు పొన్నవోలు. సాంబశివారెడ్డి మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బోవిల్ల. అమర్నాథ్ రెడ్డి, అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, మండల ఎంపీపీ ఇంచార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, వెంగల్ రెడ్డి, గోడి రమణారెడ్డి, మాచుపల్లి కృష్ణారెడ్డి, బద్వేల్ నియోజకవర్గం లోని ఏడు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైసిపి కోటి సంతకాల సేకరణ

**యాడికి. నవంబర్ 9 :**
మెడికల్ కాలేజీకు ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యాడికి మండల పరిధిలోని నిట్టూరు, కోనఉప్పలపాడు గ్రామాల్లో వైసిపి నాయకులు రామాంజనేయులు రెడ్డి. చలపతి రెడ్డి. జయకృష్ణ కోన ఉప్పలపాడు గ్రామంలో బాల గంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు రాష్ట్రంలో 2019. 24 మధ్య వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్థాపించిన కొత్త ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ సంస్థ అప్పగించే ప్రయత్నాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ నిట్టూరు గ్రామంలో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిద్దవరం రామాంజనేయరెడ్డి, పేరం చలపతి రెడ్డి, పేరం తిరుపాల్‌రెడ్డి, చాకలి జై కృష్ణ, కేశవరెడ్డి, జింకల కొండన్న, ఎరుకల సుంకన్న, కొత్తపల్లి కృష్ణారెడ్డి, చాకలి రాముడు. పరమేశ్వర్ రెడ్డి. చాకలి నాగరాజు, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



నిట్టూరు గ్రామంలో కోటి సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నాయకులు



కోన ఉప్పలపాడు లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు , వైఎస్ఆర్ అభిమానులు

# రాష్ట్రం వెలుపల సేవా కార్యక్రమాలు

### నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ దాతృత్వం..

**అనంతపురం రూరల్, నవంబర్ 9:**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ శ్రీమతి.డాక్టర్. ఎస్. నిర్మలమురళి రాష్ట్రం దాటి పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సహాయం కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి అమ్మలా వారి పరిస్థితులు, స్థితిగతులను పరిశీలించి నిర్మలమురళి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా జమ్మిగుట్ట గ్రామంలో భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి నిత్యావసరాలు అందించారు. ఇటీవల రాజు భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడడంతో కాలు విరిగింది. ఆపరేషన్ చేసి రాడ్లు వేశారు. ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. సెల్ ఫోనులో నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్మలమురళి చేస్తున్న సేవలను చూసి తమ పరిస్థితిని వివరించి సహాయం కావాలని రాజు, స్వప్న దంపతులు కోరారు. దీంతో నిర్మలమురళి రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను వారి నివాసానికి వెళ్లి అందించారు. స్వప్నకు చీర, అలంకరణ వస్తువులను అందించారు. అనంతపురం జిల్లా నుంచి తమ ప్రాంతానికి వచ్చి నిత్యావసరాలు అందించిన నిర్మలమురళికి, రాజు దంపతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఫోనులో తమ సమస్యను వివరిస్తే సహాయం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. నిర్మలమురళి చెప్పిన మంచి మాటలతో ఆరోగ్యం కుదుటపడ్డాక మరింత మందికి సేవ చేయటానికి స్ఫూర్తిగా తీసుకుంటామని రాజు భార్య స్వప్న తెలిపారు. ట్రస్టు దాతలు, సేవా సామాజిక కార్యకర్తలను అభినందించారు. ఇలాంటి సేవలు మరెన్నో చేయాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ తాను చేస్తున్న సేవను గుర్తించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సేవలో భాగమైన దాతలకు రుణపడి ఉంటామన్నారు. అవసరంలోను, ఆపదలోను ఉన్న ప్రతి ఒక్కరికి సహాయం చేసేలా ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని కోరారు. అన్నిచోట్లకు తాను వెళ్లి సహాయం చేయలేనని, అవసరం ఉన్న, అవకాశం ఉన్న వారు పేదలకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, సామాజిక కార్యకర్త శ్రీమతి కాకతీయ పాల్గొన్నారు.



రాజు కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, చైర్ పర్సన్ శ్రీమతి.డాక్టర్. ఎస్. నిర్మలమురళి

# పంపనూరులో వైభవంగా కోటి దీపార్చన

### కన్నుల పండువగా తులసీదామోదర కళ్యాణం..

**ఆత్మకూరు, నవంబర్ 9:**
పంపనూరు ఆలయంలో కార్తీక మాసం మూడవ ఆదివారం సందర్భంగా శ్రీ



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పార్వతీదేవి అమ్మవారు



పంపనూరులో జ్వాలాతోరణం వెలిగించిన దృశ్యం

తులసీ దామోదర కళ్యాణం వైభవంగా కోటి దీపార్చన నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు తండోపతండాలుగా ఆలయానికి తరలివచ్చారు. డీఎస్పీ తలారి వెంకటేశ్వర్లు ఇటుకలపల్లి సిఐ హేమంత్ కుమార్ ఎస్సై లక్ష్మణరావు, ఎంపీడీవో జీ లక్ష్మీనరసింహ తదితర అధికారుల పర్యవేక్షణలో ఆత్మకూరు ఎస్సై వారి సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ఎక్కడ ఖాళీ స్థలం కనబడనా దీపాలు వెలిగించారు. సాయంకాలం వేళ కోటి దీపార్చన కోసం మరో మారు ఆలయ పరిసరాలు శుభ్రం చేసి కోటి దీపార్చన నిర్వహించారు. ముందుగా జ్వాలాతోరణం వెలిగించి ధ్వజస్తంపై జ్యోతి వెలిగించాక అనంతరం భక్తులు కోటి దీపాలు వెలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఐదు క్వింటాళ్ల బియ్యం ఉపయోగించి అన్నవసతులు కల్పించారు. కోటి దీపారాధన తర్వాత ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అల్పాహార వ్యవస్థ చేశారు. 15000 మందికి పైగా భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారని ఈవో బాబు తెలిపారు. ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి భక్తుల రాకపోకలకు సహకరించారు. ఆలయానికి వచ్చిన భక్తుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటుచేసి ఎవరికి ఇబ్బంది కలుగని రీతిలో పోలీసు వ్యవస్థ పనిచేసింది. వైద్య ఆరోగ్యశాఖ వైద్య సేవలు అందించారు.



పంపనూరు ఆలయంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



పంపనూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు. పంపనూరు ఆలయంలో తులసీ దామోదర కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం. దీపార్చన చేస్తున్న మహిళలు



మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

# కుప్పంతో సమానంగా వికోట అభివృద్ధి చెందాలి

## ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ..

**వికోట నవంబర్ 9 :**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం నిర్వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో సమానంగా వికోట మండలం అని రంగాల్లో అభివృద్ధి చెందాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం ఆదివారం వీకోటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్దపెట్టవేస్తోందని తెలిపారు. తెలుగుదేశం కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో కొన్ని విషయాలు కార్యకర్తలకు వాస్తవాలు తెలియాలన్నారు. గతంలో కుప్పంలో భాగమైన వీకోట మండలం లోని కొన్ని పంచాయితీలు అభివృద్ధి లో శరవేగంగా దూసుకెళ్లాయన్నారు. అయితే నియోజకవర్గాల పునర్ విభజనలో భాగంగా వీకోట మండలంలోని అన్ని పంచాయతీలు పూర్తిగా పలమనేరు నియోజకవర్గంలో చేరడంతో అభివృద్ధి కొంతమేర మందగించిందన్నారు. పలమనేరు నియోజకవర్గం పూర్తిస్థాయిలో కాకపోయినా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పం అనుకుని ఉన్న వీకోట మండలాన్ని కూడా కుప్పం తో సమానంగా ముఖ్యమంత్రి అభివృద్ధి చేసే విధంగా పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ కృషి చేయాలని సూచించారు. బి.ఆర్ రాంబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ మండల నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కొత్త కార్యవర్గం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అందరి సమన్వయంతో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన ప్రెసిడెంట్ రాంబాబు పేర్కొన్నారు. ప్రజల మద్దతు పార్టీలు విజేత నమ్మకం ఉన్న ప్రతి కార్యకర్త నాయకులుగా ఎదిగేందుకు పార్టీ అధినాయకత్వం సహకరిస్తుందని డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సారథిలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు అఖండ విజయం సాధించే విధంగా నూతన పాలకవర్గం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీకేయం ఉడా చైర్మన్ సురేష్ బాబు, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్ వి బాలాజీ , రాష్ట్ర వేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ ,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, శబరిష్, ధీరజ్ , ఏ ఆర్ నాగరాజు తో పాటు వీ.కోట మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**వికోట నవంబర్ 9 :**
వికోటలోని దుర్గామాత ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. స్థానిక దుర్గామాత ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు పుర ప్రముఖుల సమక్షంలో నూతన పాలకవర్గ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులుగా జి రఘుపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపికయ్యారు. ఆలయం వద్ద జరిగిన కమిటీ సుదీర్ఘ సమావేశంలో ఇటీవల ముగిసిన 14 వ దసరా ఉత్సవాల ఆదాయ వ్యయాలను సమావేశంలో తెలియపరిచారు. దీనితోపాటు పాటు భవిష్యత్ కార్యాచరణ పై కమిటీ చర్చించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అందరూ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దుర్గామాత ఆలయ నూతన ప్రధాన కార్యదర్శిగా వి జగన్మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్ బాబు, జనార్ధన్, బాలు, కోశాధికారిగా తుకారాం ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, రామచంద్ర నాయుడు, రంగనాథ్, ఆనంద్ రెడ్డి, దవనం భక్త, మాజీ ధర్మకర్తలు దామోదర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, రిటైర్ఎంపీడీవో రమేష్ బాబు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు



నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ పభ్యులు

# ఘనంగా ఆంజనేయ స్వామికి కార్తీక మహోత్సవం

## భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలు.. ఘనంగా రథోత్సవం..

**రోళ్ల, నవంబర్ 9 :**
మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి కార్తీక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవలు అంకురార్పణ పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రతి ఏటా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా గంగాజలంతో మూలవిరాట్ ను శుభ్రపరిచి వివిధ పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



టిడిపి నాయకులను సన్మానించిన గ్రామస్తులు

మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను మేళా తాళాలతో వాయిద్యాల నడుమ ఊరేగింపుగా దేవాలయం దగ్గరికి తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తితో పాటు రామ లక్ష్మణ సీతా దేవిని వివిధ పూలమాలతో ప్రత్యేకంగాలంకరించి రథంలో ఉంచిపూజలు నిర్వహించారు. తో పాటు గ్రామస్తులు పురవీధుల గుండా జైశ్రీరామ్ నామ స్మరణతో రథాన్ని లాగారు. అనంతరం జ్యోతులను మహిళలు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి అర్పించారు. కార్తీక మహోత్సవానికి రాష్ట్ర వక్కలిగా కన్వీనర్ వివిం పాండురంగప్ప, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ జి కె ఈరన్న, ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, మాజీ క్లస్టర్ ఇంచార్జ్ భరత్, నాయకులు శీనప్ప, దొడ్డఈరప్ప, రవికుమార్, మంజునాథ్, గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండల టిడిపి నాయకులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఆంజనేయస్వామి



రథంపై కొలువుదీరిన రామ, లక్ష్మణ, సీతాదేవి. రథాన్ని లాగుతున్న దృశ్యం



ఎన్నికైన కమిటీ సభ్యులు

# జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధ్యక్షుడిగా మీనుగా వేంకటేశులు

**రోళ్ల, నవంబర్ 9 :**
శ్రీ సత్యసాయి జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మడకశిర డిఇ మీనుగా వేంకటేశులను ఆదివారం ఎన్నుకొన్నారు. శాఖ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం జరిగింది. గౌరవాధ్యక్షులుగా జి.మధుప్రకాషరెడ్డి, అధ్యక్షుడిగా వేంకటేశులు మాదిగ, ఉపాధ్యక్షులుగా కె.విజయశేఖర్, జనరల్ సెక్రటరీగా ఇసాక్ జమాలుబాష, ట్రెజరర్గా పి.రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి.ఓబుళదాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.



అనంతపురంలో చీర బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన దగ్గుపాటి ఫౌండేషన్, డిస్కవరీ సభ్యులు

# ప్రభుత్వ స్థలంలో పట్టా భూమి!

## పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

**సంగం, అక్టోబర్ 9:**
ముంబాయి జాతీయ రహదారి నిర్మాణం జరిగిన తర్వాత సంగం వద్ద జరుగుతున్న అన్యాయంపై రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో లేఅవుట్లు యజమానులు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముంబై జాతీయ రహదారి నిర్మాణం జరిగిన సమయంలో సంగం చెక్ పోస్ట్ వద్ద సర్వే నంబర్ 247. 248. 249.250. భూమికి సంబంధించి 14 మంది వద్ద స్థలాలు ఇల్లు సేకరించి దానికి సంబంధించి డబ్బు ా రోడ్డు రవాణా శాఖ అధికారులు చెల్లించారు. ప్రస్తుతం ఇప్పుడు కొందరు పలుకుబడి ఉపయోగించుకుని ప్రభుత్వానికి నగదు తీసుకొని విచ్చేసిన స్థలంలోనే పట్టా భూమిని అని చెప్పేని వ్యాపారాలు సాగిస్తున్నారు .ఇక్కడ రోడ్డు సెంటర్ నుండి రెండు వైపులా 200 అడుగులు ఒకవైపు 100 అడుగులు చొప్పున స్థలాలను రోడ్డు రవాణా శాఖ అధికారులు సేకరించి స్వాధీన పరుస్తున్నారు.

ఆ సమయంలో ఆర్ అండ్ బి అధికారుల నుండి తుంగా దయాకర్ రెడ్డి వద్ద 247/బి/6లో నాలుగు సెంట్లు. 247/బి/7లో 35 సెంట్లు భూమిని రోడ్డు రవాణా శాఖ అధికారులకు కేటాయించారు. అప్పట్లో రోడ్డు రవాణా శాఖ అక్కడ పనులు చేయకపోవడంతో ఆ స్థలాన్ని కొంత మిగిలిన భాగాన్ని వేరే వ్యక్తులకు ఆయన అమ్ముకున్నారు. మిగిలిన స్థలంలో అనుమతులు లేకుండా పెట్రోల్ బంక్ నుండి జాతీయ రహదారిపైకి రోడ్డు వేశారు. జాతీయ రహదారి పైకి పెట్రోల్ బంకు నుండి వచ్చే వాహనాల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి ఈ సర్వే నంబర్లకు సంబంధించి 23 లక్షల రూపాయలు నగదు రోడ్డు అధికారుల వద్ద తీసుకున్నారు.

ఈ రికార్డులన్నీ పరిశీలించిన అనంతరం తహసీల్దార్ నాగరాజు ఈ స్థలం ప్రభుత్వ స్థలమని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి నగదు తీసుకొని అమ్మివేసిన స్థలంలో పట్టా స్థలం ఎలా వచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు రవాణా శాఖ అధికారుల రికార్డు ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో వాళ్ళు సేకరించినటువంటి స్థలానికి పట్టా భూమికి సంబంధించి ఉండి ఉంటే వారికి నగదు కూడా చెల్లించారని రవాణా శాఖ అధికారులు తెలుపుతున్నారు.

రోడ్డు రవాణా శాఖ అధికారులు సేకరించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు రికార్డులలో ఇది ప్రభుత్వ భూమి అని నమోదు చేయకపోవడమే కారణమని మరికొందరు అధికారులు వెల్లడిస్తున్నారు. స్థలం సేకరించిన రోడ్డు రవాణా శాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు సంబంధిత భూమిని స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. అదే సమయంలో సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు ఈ స్థలానికి సంబంధించి రైతాంగానికి నగదులతో పాటు వారి వద్ద సేకరించిన రికార్డులను రెవిన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. గతంలో సంగం తాసిల్దార్గా పనిచేసిన నాగరాజు రికార్డులను పరిశీలించి ఇది ప్రభుత్వ స్థలమేనని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత రెవెన్యూ అధికారి మాత్రం ఇది పట్టా భూమి అని, తాను స్వయంగా పరిశీలించానని చెప్పడం ఎంతవరకు న్యాయమని స్థానికులు అంటున్నారు.

ప్రభుత్వ భూమిగా ఒక అధికారి బోర్డులు ఏర్పాటు చేస్తే ఇక్కడే పనిచేస్తున్న మరో అధికారి 23 సెంట్లు పట్టా భూమి ఉందని, కనుక వారి ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చునని రెవెన్యూ రికార్డులను తారుమారు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయలు ప్లాట్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాల్లో అమ్ముకునేందుకు రెవెన్యూ అధికారులే మద్దతు తెలుపుతున్నారా లేక రికార్డులు పరిశీలించకుండా వ్యాపారాలు సాగిస్తున్నారా అన్నది తేలాల్సి ఉంది. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని స్థానికులు కోరుతున్నారు.



గతంలో సంగం తహసీల్దార్ నాగరాజు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



కోటి సంతకాల సేకరణ సమావేశంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

## బెంగళూరులో కోటి సంతకాల సేకరణ.. వైకాపా నేతలు కాంతరాజు.. ఈరలక్కప్ప..

**అగళి, నవంబర్ 9**
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా బెంగళూరులో వైకాపా నేతలు కోటి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు అలుకూరు కాంతరాజు, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాలతో కూటమి మెడలు వంచుతామన్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలకు పునాది రాళ్లు వేయగా అందులో 5 మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అందని ద్రాక్షగా మార్చడమే చంద్రబాబు ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మెడలు వంచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీపీపీ విధానం రద్దుకు కోటి సంతకాల సేకరణ కార్యాచరణ చేపట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సంక్షేమ పనులు అంతంత మాత్రమేనని, కూటమిని కూకటి వేళ్లతో పీకేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉందన్నారు. 2029లో వైఎస్సార్సీపీ కార్యకర్తల పాలన ప్రారంభం కాబోతోందని జగన్ 2.0కి రథసారథులు కార్యకర్తలే అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి, మడకశిర నియోజకవర్గం లో ఎమ్మెల్యేగా ఈరలక్కప్పను అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని ప్రజలు వ్యక్తం చేశారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు హలుకూరు కాంతరాజ్, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి జిబీ శివకుమార్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, తాలాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శివన్న,మడకశిర తాలూకా గ్రీన్ భారత్ ఫౌండేషన్ అధ్యక్షులు కోడిపల్లి కామరాజు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ దేవరాజ్, మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్,డిఎల్ ఎంజేరె గౌడ సర్పంచ్ నటరాజ్,సీనియర్ కార్యకర్తలు వందలాది జగన్ అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైకాపా నేతలు

# స్వామిఅమ్మవార్లకు ఆరుద్ర నక్షత్రం విశేష పూజలు

**శ్రీశైలం, నవంబర్ 9:**
శ్రీశైలం మహా క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం నాడు స్వర్ణరథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించారు. శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణరథంపై కొలువై ఉన్న శ్రీస్వామిఅమ్మవార్లకు పూజాధికాలు జరిపించి ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్నికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు.



స్వామిని దర్శించుకుంటున్న ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు



స్వర్ణ రథం పై స్వామి అమ్మవార్లుకు పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా కార్యక్రమములో పలు కళా బృందాల కోలాటం, తాళం భజన, డోలు వాయిద్యం మొదలైన కళారూపాలు దేవస్థానం వారు ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు, పలువురు శాఖాధిపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



కోలాటం ఆడుతున్న కళాకారులు



# ఆంధ్రకింగ్ ఫస్ట్ డే ఫస్ట్ సాంగ్




టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న కొత్త సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా' ప్రస్తుతం భారీ అంచనాలను సొంతం చేసుకుంది. పాన్ ఇండియా స్థాయి ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా, ఈ చిత్రానికి యువ దర్శకుడు మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, టీజర్, పాటలు అన్నీ ప్రేక్షకుల్లో మంచి హైప్‌ను సృష్టించాయి. ఇప్పుడు మేకర్స్ తాజాగా నాలుగో సింగిల్ 'ఫస్ట్ డే ఫస్ట్ షో' సాంగ్‌పై అప్‌డేట్ ఇచ్చారు. ఈ సాంగ్‌ను నవంబర్ 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రామ్ ఎనర్జీతో నిండిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో కనిపించనున్నారు. అలాగే రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ వంటి ప్రతిభావంతులైన నటులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి వివేక్ %�డ% మర్విన్ సంగీతం అందించాడు. ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డ ఈ 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం నవంబర్ 28న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

# ఘట్టమనేని ఫ్యామిలీలో మూడోతరం హీరో



మహేశ్‌బాబు సోదరుడు, దివంగత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నారని కొంతకాలంగా వార్తలు, ఫొటో షూట్‌లు వైరల్ అయ్యాయి. అయితే ఇప్పుడు దానిపై క్లారిటీ వచ్చింది. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ అజయ్ భూపత జయకృష్ణను హీరోగా పరిచయం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. నా తదుపరి చిత్రంతో ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం కావడం ఆనందంగా, గర్వంగా ఉంది. గొప్ప కథ, అంతకుమించిన బాధ్యతో ఈ సినిమా వస్తుంది. కొండల హృదయం నుంచి రా, ఇంటెన్స్, రియలిస్టిక్ లవ్‌స్టోరీతో ఈ సినిమా రాబోతుంది. త్వరలో టైటిల్ ప్రకటిస్తాం' అని అన్నారు.ఆయన షేర్ చేసిన పోస్టర్ చూస్తే తిరుమల బ్యాక్‌డ్రాప్ స్టోరీతో ఈ సినిమాని తెరకెక్కించనున్నట్టు అర్థమవుతోంది. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణతో 'అగ్ని పర్వతం' చిత్రాన్ని తీసిన అశ్వినీదత్ మహేశ్‌బాబు తొలి సినిమా 'రాజకుమారుడు' సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు. ఇప్పుడు ఘట్టమనేని మూడోతరాన్ని కూడా ఇండస్ట్రీకి పరిచయం చేస్తోంది వైజయంతీ సంస్థ. ఈ విషయాన్ని చెబుతూ పద్మాలయా స్టూడియోస్ కూడా ఓ లేఖ విడుదల చేసింది. పద్మాలయా స్టూడియోస్, వైజయంతి మూవీస్ సంస్థ బంధం తరతరాల వెండితెర అనుబంధం అని పేర్కొన్నారు.

# ఇరువురి భామల కౌగిలిలో ప్రారంభం



కమిటీ కుర్రాళ్లు' ఫేమ్ త్రినాథ్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు మలినా హీరోయిన్లుగా 'ఇరువురు భామల కౌగిలిలో' చిత్రం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ఇందులో అక్షర గౌడ కీలకపాత్రలో నటిస్తున్నారు. కె.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి తెరకెక్కిస్తున్నారు. దీపా ఆర్ట్స్ పతాకంపై శ్రీనివాస గౌడ్ నిర్మిస్తున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం తొలి సన్నివేశానికి నిహారికా కొణిదెల క్లాప్‌నివ్వగా బి.గోపాల్ కెమెరా స్విచాన్ చేశారు. కె.రాఘవేంద్రరావు స్క్రిప్ట్‌ను నటీనటులు, దర్శక, నిర్మాతలకు అందచేశారు. ఫస్ట్‌షాట్‌కి కోదండరామిరెడ్డితో పాటు నిర్మాత, కెమెరామెన్ ఎస్ గోపాల్‌రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. ఈ చిత్రానికి సంగీతంశీను భీట్స్, డిఓపి శశాంక్ శ్రీరామ్, మాటల రచయితశ్రీధర్ సీపాన, ఎడిటర్ రాఘవేంద్ర వర్మ.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.